# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 3-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:27 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

సౌనలు రెండు
గుడ్డులో ఐక్యరాగం
జీవోద్ధరణ.

హఠాన్మరణం
ఓ బాధ ఓ సంతోషం
తప్పిన సేవ.

తలకు తల
ప్రతీకార చర్యలు
పిచ్చి పనులు

పాత బంగారం
కొత్తకన్న నాణ్యత
కల్తీల కాలం.

వానల కోసం
గాడిదల పెళ్ళిళ్ళు
వింత ఆచారం.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

కాంగిరేసు సర్కారిది
వెయ్యి దినాల పాలనా !
గిల్లుకుంటు గిచ్చుకుంటు
పెట్టిందోయ్ ఓ మూలన !
ముఖ్యమంత్రి మంత్రులంత
మంతనాలు ఢిల్లీలో !
పరిపాలన సుడిగాలై
తెలంగాణ గల్లీల్లో !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# డిఫెన్స్ ఎక్స్‌పో ప్రారంభానికి రాజ్‌నాథ్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్



ఢిల్లీ, సెప్టెంబర్ 02: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

దేశవ్యాప్తంగా రక్షణ రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు.

రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కోరారు.

హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆండీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ శాఖ మొత్తం1,500 ఎకరాలు కోరిందని.. మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాలకు ఈ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని అన్నారు.

ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

## GSLV-F17 ప్రయోగం.. విజయవంతం కావాలని ఇస్రో చైర్మన్ ప్రత్యేక పూజలు

నెల్లూరు, సెప్టెంబర్ 2: సూళ్లూరుపేట గ్రామదేవత శ్రీ చెంగాళమ్మ అమ్మవారిని ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ దర్శించుకున్నారు. షార్ నుంచి చేపట్టనున్న GSLV-F17 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 4వ తేదీన తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి GSLV-F17 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగం ద్వారా EOS-05 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు. ఉపగ్రహాన్ని సుమారు 28,934 కిలోమీటర్ల ఎత్తులోని GTO ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టేలా శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రయోగానికి 27 గంటల ముందు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. EOS-05 ఉపగ్రహం భారత భూభాగాన్ని పరిశీలించనుంది. ఈ ఏడాదిలో చేపట్టనున్న ప్రయోగాల్లో ఇది తొలి ప్రయోగమని ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ తెలిపారు. ఈ ఏడాది మొత్తం ఏడు రాకెట్ ప్రయోగాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. అక్టోబర్ నెలలో మరో రాకెట్ ప్రయోగాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉ GSLV-F17 ప్రయోగం నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తలు, అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ప్రయోగం విజయవంతం కావాలని సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ అమ్మవారిని ఇస్రో చైర్మన్ దర్శించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# 22ఎ భూములపై అసెంబ్లీలో ఏం మాట్లాడతారో రండి..

## -బీఆర్ఎస్‌కి పొంగులేటి సవాల్



హైదరాబాద్, సెప్టెంబర్ 2: 22ఎ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఎ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు. ఈరోజు (బుధవారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్‌చాట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, పెట్టిన బకాయిలు తాము చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. యాస, భాషలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలను తామే చెల్లించామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెట్టిన బకాయిలను కూడా తామే చెల్లించామని పేర్కొన్నారు.

### వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం..

'మా పాలనలోని వెయ్యి రోజుల్లో రూ.1.76లక్షల కోట్లను రైతులకు ఇచ్చాం. ఆనాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అన్నారు.. మేము వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం. ప్రజలను కావాలని మా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడు తున్నారు. ఉప ఎన్నికల్లో ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా గులాబీ పార్టీకి జ్ఞానం రాలేదు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడించాం. అయినా వారిలో మార్పు రాలేదు. ఆనాడు బతుకమ్మ చీరల్లో అవినీతికి పాల్పడ్డారు. రాహుల్ గాంధీని విమర్శస్తావా కేటీఆర్.. సంస్కార హీనంగా మాట్లాడితే ప్రజలు క్షమి ంచరు. అధికారంలోకి వస్తామని మీరు కలలు కంటూనే ఉండం డి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మేము నిర్మిస్తున్నాం. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాం. టీమ్స్‌పై బీఆర్ఎస్ నిస్సిగ్గుగా మాట్లాడుతోంది. నిరసన తెలిపేందుకు అవకాశం లేకుండా ధర్నాచౌక్ ఎత్తేసిన మీరా.. స్వేచ్ఛ గురించి మాట్లాడేది. కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారు' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహించారు.

### కొత్తగా మూడు లక్షల పెన్షన్లు ఇస్తాం..

'మీ 3,475 రోజుల పాలన కంటే, మా వెయ్యి రోజుల పాలనే బాగుందని ప్రజలు చెబుతున్నారు. మీరు పేదలకు ఇళ్లు ఇచ్చారా.. రేషన్ కార్డులు ఇచ్చారా... కొత్తగా మరో మూడు లక్షల పెన్షన్లు ఇవ్వబోతున్నాం. ఖమ్మంలో పోడు భూముల సమస్య పరిష్కరిస్తానని కేసీఆర్ అన్నారు. భద్రాచలం రాములోరి గుడికి రూ.1000 కోట్లు ఇస్తానని దేవుడినే మోసం చేశారు. మా మేనిఫెస్టోలో పెట్టినవన్నీ మేము ఇంకా పూర్తి చేయలేదు. ఒక్కొక్కటిగా హామీలను అమలు చేస్తాం. కోర్ ప్రాంతంలో మేము డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తున్నాం. విలువైన భూములను పేదలకు ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారు. మీరు ఆర్టీసీ ఎక్స్ రోడ్డు నుంచి అసెంబ్లీ వరకు పొర్లు దండాలు పెట్టినా మేము పేదలకు ఇళ్లు కట్టించి తీరుతాం. నేను వాస్తవాలు చెబితే మీరు తల ఎక్కడ పెట్టుకుంటారో చూద్దాం. ధరణితో మీరు కొల్లగొట్టిన భూములపై విచారణ జరుగుతోంది. మీరు ఏం వ్యాపారం చేశారని.. వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి... మీ బండారం శకుని మామ కూతురు దగ్గర ఉంది. ముందు దానికి సమాధానం చెప్పండి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ చేశారు.

### మీ కుటుంబానికి వేల కోట్లు ఎలా వచ్చాయి.

'సొంత ఆడబిడ్డకు న్యాయం చేయని మీరు పేద ఆడపడుచులకు న్యాయం చేస్తారా.. ఎంత మంది దళితులకు భూము లు ఇచ్చారు, దళిత బంధు ఎంత మందికి ఇచ్చారు. మీ కుటుంబానికి వేల కోట్లు ఎలా వచ్చాయి.. ఈ రాష్ట్రాన్ని కొల్లగొడితే మీకు వచ్చిన డబ్బులు కావా.. దేశంలోనే రిచెస్ట్ ధనిక పార్టీ ఎలా అయింది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన పాత్ర పోషించకపోవడం దురదృష్టం. ముసుగు తీసి బయటకొస్తే గులకరాళ్లతో కొడతారని భయమా... ప్రజల ఇబ్బందులపై మంచి సూచనలు ఇవ్వొచ్చు కదా.. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష హోదాకు అనర్హులు. మీరు బీజేపీతో జత కట్టారని కవిత చెప్పింది నిజమే అనిపిస్తోంది. ముందు మీ ఇళ్లు చక్కపెట్టుకోండి. ఉస్మానియా యూనివర్సిటీకి మేము చేస్తా మన్నది కచ్చితంగా చేస్తాం' అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# రైతులు, ఉపాధ్యాయులపై డీఎంకే పెట్టిన కేసులను ఎత్తివేస్తున్నాం : అసెంబ్లీలో సీఎం ప్రకటన



తమిళనాడు సెప్టెంబర్ 2: తమిళనాడు లో అధికారంలోకి వచ్చిన టీవీకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసులను పూర్తిగా ఉపసం హరించుకుంటున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీ లో ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా నిరసనకారులకు భారీ ఊరట లభించినట్లయింది. 2021 మే నుంచి 2026 మధ్య కాలంలో ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం.. సిప్‌కాట్ పారిశ్రామిక వాడ, పరందూర్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిపై అమానుషంగా వ్యవహరించిందని విజయ్ విమర్శించారు.

ఆ సమయంలో రైతులు, ఉపాధ్యాయులపై పలు కేసులు నమోదు చేశారని, అవి ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని విజయ్ స్పష్టంచేశారు. కేసుల ఎత్తివేత నిర్ణయం ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. ఇదిలాఉండగా, 'నీట్' కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులపై కేసులను ఉపసంహరించుకోవాలని సీపీఐ, ఎన్ఎల్‌సీ ఆందోళనకారులపై కేసులను రద్దు చేయాలని పీఎంకే పార్టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయితే ఆ డిమాండ్లపై టీవీకే ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.


**చురక**

వెయ్యి రోజుల్లో హస్తం
వేసినడుగు ప్రగతిపథం
అమలులోని అడ్డంకులు
అధిగమిస్తే ప్రజాహితం.
హామీల ఆకాశం
అందుకొనుట కష్టమే
ఆర్థికంగా నిధుల లేమి
అందరికీ స్పష్టమే



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

సానుకూలతకు సిరి
సద్గుణుల స్వర్ణపురి
ఇదియె మల్కాజిగిరి
అనును రాధశ్రీ !!
సద్భావనముల ఝురి
సద్భాషణా లహరి
యాదాద్రి భువనగిరి
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210


# నేపాల్ విపత్తుపై షాకింగ్ విషయం.. ముందే కనిపించిన సంకేతాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఘోర విపత్తు నేపాల్‌ను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఆకస్మిక వరదలు సంభవించి వారం రోజులు గడిచినా సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. నేపాల్‌లో సంభవించిన వినాశకరమైన వరదల కారణంగా మృతుల సంఖ్య బుధవారం నాటికి 1,127కు చేరినట్లు పోలీసులు వెల్లడించారు. ఇంకా వేలాది మంది గల్లంతైనట్లు, వారి కోసం సహాయక బృందాలు విస్తృతంగా గాలిస్తున్నట్లు తెలిపారు.

నేపాల్ పోలీసుల వివరాల ప్రకారం.. చిత్వాన్ ప్రాంతం నుంచి 348 మృతదేహాలను వెలికితీయగా, నవల్పరాసి తూర్పు నుంచి 217, నవల్పరాసి పశ్చిమ నుంచి 190, నువాకోట్ నుంచి 155 మృతదేహాలను గుర్తించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఈ భారీ వరదలకు కారణమైన హిమానీనదం కూలిపోవడానికి కొన్ని రోజుల ముందే ప్రమాద సూచనలు కనిపించాయని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు మరింత మెరుగ్గా ఉండి ఉంటే భారీ ప్రాణనష్టాన్ని నివారించే అవకాశం ఉండేదా.. అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ముఖ్యంగా వరద ప్రవాహం దిగువన ఉన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న వందలాది మంది కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు మరింత సమర్థవంతమైన విపత్తు సన్నద్ధత అవసరమని నిపుణులు అభిప్రా యపడుతున్నారు.

### ఉపగ్రహ చిత్రాల్లో ముందస్తు హెచ్చరికలు..

ఆగస్టు 28న సిద్ధం చేసిన హైరిస్క్ నివేదిక ప్రకారం.. విపత్తుకు ముందే ఉపగ్రహ చిత్రాల్లో హిమానీనదం అస్థిరతకు సంబంధించిన సంకేతాలు కనిపించాయి. పరిశీలనలో భాగంగా శాస్త్రవేత్తలు హిమానీ నదంలో పలు మార్పులను గుర్తించారు. ఉపగ్రహ చిత్రాల్లో హిమానీనదం ఉపరితలంలో మార్పులు కనిపించాయని, లోపల నీటి కదలికలు వేగంగా పెరుగుతున్నట్లు ఆధారాలు లభించాయని నివేదిక పేర్కొంది. ఆగస్టు 24న తీసిన చిత్రాల్లో కరిగిన నీరు గోధుమ రంగులోకి మారినట్లు గుర్తించారు.అంతేకాకుండా సమీపంలోని రాతి నేల వాలులోకి ఒక పగులు విస్తరిస్తున్నట్లు పరిశోధకులు గమనించారు. "సంఘటన జరిగిన తర్వాత పరిశీలిస్తే.. విపత్తుకు ముందు కొన్ని సూచనలు కనిపించాయి" అని శాస్త్రవేత్తలు తెలిపారు.

# హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 2: నగరంలోని శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నకిలీ కరెన్సీ తయారీ.. చలామణికి పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నకిలీ నోట్లను తయారు చేసి వాటిని మార్కెట్‌లో చలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా నిఘా పెట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి మొత్తం రూ.2.90 లక్షల విలువైన నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా నకిలీ నోట్ల తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలు,

వివిధ రకాల సామగ్రిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో నకిలీ కరెన్సీ చలామణిపై పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు.

సాధారణ ప్రజలను మోసం చేస్తూ నకిలీ నోట్లను చలామణిలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను అడ్డుకునేందుకు పోలీసులు చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ ముఠా పట్టుబడినట్లు తెలుస్తోంది.

నకిలీ కరెన్సీ ముఠా పట్టుబడటంతో అసలు నోట్లను ఎక్కడ తయారు చేస్తున్నారు, తయారీకి అవసరమైన పరికరాలు, సామగ్రిని ఎక్కడి నుంచి సమకూర్చుకున్నారు, నకిలీ నోట్లను ఏ ప్రాంతాల్లో చలామణి చేస్తున్నారు అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా వ్యక్తులు ఉన్నారా... నకిలీ కరెన్సీ తయారీకి ప్రత్యేకంగా ఎక్కడైనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారా.. అనే అంశాలపైనా ఆరా తీస్తున్నారు. అరెస్టయిన నిందితులను విచారించడం ద్వారా ఈ వ్యవహారానికి సంబంధించిన మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా నకిలీ నోట్ల తయారీ వెనుక ఉన్న వ్యక్తులు, వాటిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్న నెట్‌వర్క్‌పై పోలీసులు దృష్టి సారించారు.

# సురేఖ వివాదంపై అధిష్ఠానానికి సీఎం రేవంత్‌రెడ్డి నివేదిక

## త్వరగా నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానానికి సీఎం విజ్ఞప్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 2: మంత్రి కొండా సురేఖను చుట్టుముట్టిన వివాదం కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి వెళ్లింది. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ అధిష్ఠానానికి నివేదిక అందించారు. వివాదానికి సంబంధించిన అంశాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లిన సీఎం.. కొండా సురేఖపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది.

కొండా సురేఖ కూతురు స్మిత చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో, ఇతర వివరాలను టీపీసీసీ ఇంగ్లిష్‌లోకి అనువదించి పార్టీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన నివేదికను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ కే.సీ. వేణుగోపాల్‌కు అందించినట్లు సమాచారం.

### కొండా సురేఖ వివాదంపై నేడు నిర్ణయం..

ఈ వ్యవహారంపై ఏఐసీసీ స్థాయిలో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణ, నేతల వ్యాఖ్యలు, వివాదానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించిన అనంతరం అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మంత్రి కొండా సురేఖ ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేశారు. తన కూతురు చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేసి చర్యలు తీసుకోవడం సరికాదని ఆమె పేర్కొన్నారు. తనపై చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కూడా వ్యాఖ్యానించారు.

కొండా సురేఖ చేసిన తాజా వ్యాఖ్యలు, మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానానికి నివేదిక సమర్పించినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అధిష్ఠానం ఈ అంశాన్ని ఏ విధంగా పరిష్కరిస్తుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ లేదు: సింగరేణి యాజమాన్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 02: సంస్థకు చెందిన భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ లేదని సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. సింగరేణి భూగర్భ గనుల ప్రైవేటీకరణ అంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. సంస్థకు చెందిన భూగర్భ గనుల ప్రైవేటీకరణ అంటూ జరుగుతున్న ప్రచారాన్ని బుధవారం యాజమాన్యం ఖండించింది. ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని వివరించింది. సంస్థ నష్టాల్లో ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రత కోసం భూగర్భ గనులను కొనసాగిస్తామని పేర్కొంది.గనులు మూసివేయడం, ప్రైవేటు పరం చేయడం తమ లక్ష్యం కాదని సింగరేణి యాజ మాన్యం ఈ సందర్భంగా కుండబద్దలు కొట్టింది.

ఉత్పత్తి పెంచి, నిర్వహణ వ్యయాలు తగ్గించి గనులను లాభాల్లోకి తీసుకురావడమే ఈ సంస్థ ముఖ్య లక్ష్యమని యాజమాన్యం వెల్లడించిం ది. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని శాంతిఖని గనిపై కేవలం పైలట్ అధ్యయనం కోసమేనని వివరించింది.

నేటి నిజం
# సాహితీ కెరటాలు
website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 3-9-2026

## సప్త పదులు
ప్రక్రియా సృజనకర్త: సుధామ



సత్కారం
నమస్కారం

శిరస్సు వంచి
చేతులు
జోడించడమే
సంస్కారం
-వై.నాగేశ్వరరావు
9959965215

అందరం
సుందరం

కుటుంబం
బాగుపడాలంటే ...
కలిసి ఉండాలి
మనమందరం
-కాకర్ల చెంచలరావు
ఒంగోలు.

ఏమరుపాటు
కలవరపాటు

ఏవిషయంలోనూ
నిర్ణయం
తీసుకోవడంలో
వద్దు తొందరపాటు
-బెన్నూరి వనజాక్షి
హైదరాబాద్

వాపు
మాపు

అనుకోని
ప్రమాదాల వలన
మారుతుంది
రూపు
-కామేశ్వరి
హైదరాబాదు

శ్రావణం
శ్రవణం

పరమ శివుని
గాధలు
శ్రద్ధతో
స్మరణం.
-రాజప్ప
రాజమహేంద్రవరం

అంబరం
ఆడంబరం

కన్నుల
పండుగగా జరిగేటి
దేశాలమ్మ
సంబరం
-సత్య ప్రసాద్
మండపేట

## నేపాల్లో భీభత్సం

వరదలో బురదలో క్షతగాత్రులయ్యారు
ఉప్పనై పోటెత్తి ఊర్లనే మింగింది
రణ భూమిగా మారిందీ నేల
పురవీధులు గల్లంతై కన్నీరే మిగిలింది
శోక సంద్రమైంది
ఆదుకుందాం అండగుందాం
మానవత్వం చాటుదాం.

ఎంత విధ్వంసం సంభవించింది
నేపాల్ అవని పై
భూకంపం పుట్టించి జలప్రళయం సృష్టించి
ఉరుములేని
మెరుపులాగా తరుముకొచ్చింది
మృత్యువు రాకాసి
వేట కుక్కలా నగరాన్ని కాటు వేసింది.
కళ్లముందే ఎందరో జల సమాధయ్యారు



- గడ్డమీది
చంద్రమోహన్ గౌడ్
9866510399




హిమాలయాల మీంచి
శివుడు పారిపోతున్నాడు.
తెల్లగా ఉండేవాడు
ఉద్గార వికారాల వల్ల
నల్లబడ్డాడు.
కనిపించే
అనంత సౌందర్యం వెనుక
అంతు దొరకని
అంతర్గత ఒత్తిడి.
భారత్, చైనా, టిబెట్
భూటాన్, నేపాళ్, పాకిస్తాన్
ఇవన్నీ వొట్టి పేర్లు,
దక్షిణాసియా సమస్తం
అస్తవ్యస్తం.
గాలికి సరిహద్దులు లేవు
మంచు పలకలకు
ఒకవేళంటూ ఉండదు
అకస్మాత్ ప్రమాద సరస్సులపై
సూర్యోదయాలు ఉపద్రవ వర్ణరంజితాలు.
ఒకప్పుడు
భూమి సురుడు
అటసనిగాంచిన
అంబరచుంబి శిరసరజ్జురులు కావు
ఇప్పుడవి కాలుష్య కాసారాలు.
మనిషి ఏం చేస్తున్నాడు!
మంచూ రాళ్ళూ నీళ్లను
కన్నీళ్లుగా మార్చి పారేశాడు.
నరకానికి రోడ్లు వేశాడు
పర్వతాల గుండెలు చీల్చాడు.
నేపాళమా !
ఇవాళ నువ్వు భూగోళ రోదనవి
రేపు మరొకరు
మేలుకోమనిషీ!
లేదా శాశ్వత నిద్రేగతి.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

## అక్షరాయ నమః

అమ్మ ఒడిలో కళ్లు తెరిచినప్పుడు
ప్రపంచం అంటే అమ్మ ముఖమే.
పలకపై రాయించిన ఓ గీత
ఆ గీతలో ఓ అక్షరం
ఆ అక్షరంలోనే మొదలైంది
ఎవరికీ తెలియని ఓ అనంత విశ్వం.
అక్షరాయ నమః!
అక్షరంతో ఆ తొలి స్పర్శే
తెలియనితనానికి వెలుగునిచ్చింది.
మాట ఒక అర్థాన్ని ఇస్తే,
వాక్యం ఒక భావాన్నిచ్చింది
చదువు ఒక ప్రపంచాన్ని తెరిచింది.
అక్షరం...
కేవలం శబ్దం కాదు
పలకలేని పెదవులపై పుట్టిన స్వరం.
కేవలం గీత కాదు
నుదుటిపై విధి రాతను మార్చే శక్తి.
పుట్టుక చిరునామా ఇస్తే
చదువుతో గుర్తింపును ఇస్తుంది.
మట్టి బాటలో నడిచిన బాలుడు
అక్షరాన్ని తోడుగా చేసుకొని
పాఠశాల గడప దాటి
జ్ఞాన ప్రపంచంలోకి నడిచాడు.
అది అతన్ని
విద్యార్థి నుంచి విద్వాంసుడి వరకు
గురువు నుంచి నాయకుడి వరకు తీసుకెళ్లింది.
చివరికి తనను తాను ప్రశ్నించగల
మనిషిని చేసింది.
పలకపై మొదలైన ఆ గీత
పత్రంపై సంతకమైంది
సంతకం స్వాభిమానమైంది
స్వాభిమానం స్వేచ్ఛ అయింది.
అక్షరం
కంటికి చూపు మాత్రమే కాదు
దిశను ఇస్తుంది.
మెదడుకు జ్ఞానం మాత్రమే కాదు
వివేకాన్ని జోడిస్తుంది.
జీవితానికి అర్థం వెతికే ధైర్యం ఇస్తుంది.
అందుకే అక్షరాస్యత అంటే
అక్షరాలను నేర్చుకోవడం మాత్రమే కాదు
మోసాన్ని పసికట్టడం
నిజాన్ని నిలబెట్టే ధైర్యం
హక్కును అడిగే స్వరం
బాధ్యతలను అర్థం చేసుకోవడం
మనిషిని మనిషిగా చూడగల హృదయం.
ఆజ్ఞకు తల వంచిన మనిషికి
అక్షరం ఇచ్చిన గొప్ప స్వేచ్ఛ
'ప్రశ్నించడం'!
అధికారం ఇవ్వడంతో పాటు
అధికారాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని ఇచ్చింది.
గోడలు కట్టి మనుషుల్ని విడదీయదు
దాగుడుమూతలు ప్రోత్సహించదు
భాషలు వేరైనా
భావాలకు వంతెన కడుతుంది
దేశాలు వేరైనా
మనసులకు దగ్గరవుతుంది
కాలాలు మారినా
జ్ఞానాన్ని తర తరాలకు మోసుకెళ్తుంది.
మనిషి మరణించినా
అతను రాసిన ఓ మంచి వాక్యం
మరొకరి జీవితంలో వెలుగవుతుంది.
అందుకే అక్షరం
అమరత్వానికి మనిషి వేసిన అడుగు.
అక్షరం
కళ్లకు ప్రపంచాన్ని చూపింది
ప్రశ్న వేయడం నేర్పింది
బుద్ధికి విచక్షణను ఇచ్చింది
నడకకు దిశను ఇచ్చింది
ఉనికికి అర్థాన్ని ఇచ్చింది
పల్లె మట్టిలో నడిచిన అడుగులకు
పట్టణం దారులు చూపింది
పలకపై వంచిన తలకు
ప్రపంచ వేదికలపై నిలదొక్కుకునే
నమ్మకాన్ని ఇచ్చింది.
ఒక అక్షరం
బాలుడిని విద్యార్థిగా
విద్యార్థిని శాస్త్రవేత్తగా
శాస్త్రవేత్తను వెలుగునిచ్చే
మనిషిగా తీర్చిదిద్దుతుంది.
కానీ
అక్షరానికి అంతిమ గమ్యం
పదవి, ప్రతిష్ఠ, ధనం, కీర్తి కాదు
మనిషిలోని మనిషిని మేల్కొల్పడం.
అందుకే...
వేల పుస్తకాలు చదివినా
ఒక్క మనిషిని అర్థం చేసుకోలేకపోతే
అది జ్ఞానం కాదు.
వందల వాక్యాలు సృజించినా
ఒక్క కన్నీటి చుక్కను తుడవలేకపోతే
అది అక్షర సంపద కాదు.
లక్షల అక్షరాలు నేర్చుకున్నా
ఒక్క అన్యాయాన్ని ఎదిరించ లేకపోతే
అది విద్య కాదు.
అక్షరం
మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి
అక్కడి నుంచి
మనిషిగా మనగల దృష్టిని ఇవ్వాలి.
అక్షరం పుస్తకంగా, పుస్తకం జ్ఞానంగా
జ్ఞానం ప్రజ్ఞగా, ప్రజ్ఞ వివేకంగా
వివేకం కరుణగా
కరుణ మానవత్వంగా వికసిస్తే...
అక్షరం అక్షరమవుతుంది
అమరత్వం సిద్ధిస్తుంది
విద్య విద్యగా నిలుస్తుంది
మనిషి మనిషిగా అవతరిస్తాడు!
అక్షరం ఉన్నతినిచ్చిందని
గర్వించడం కాదు
ఆ ఉన్నతి నుంచి
కింద ఉన్న మనిషిని పైకి లేపగలిగితే
నేర్చుకున్న అక్షరానికి
సార్థకం, అర్థమని భావించాలి.
అక్షరమా
మొదట దిద్దిన గీత నుంచి
జీవితపు చివరి శ్వాస వరకు
నీవే కాదా...
నా అదృశ్య గురువు, నిత్య దీపం
నిశ్శబ్దానికి స్వరం?
విద్య, జ్ఞానం, వివేకం, స్వేచ్ఛ...
అన్నీ కలబోసిన ఓ మహాశక్తివి నీవు!
నీవు గీతవు కాదు.. ఉదయ రేఖవు
నీవు చుక్కవు కాదు.. కాలం సంతకం
నీవు చూపిన వెలుగే నా జీవితం
నీవు ఇచ్చిన దిశే నా గమ్యం.
నన్ను నాకే పరిచయం చేసిన
నీ అనంత రూపానికి
అనంత ప్రణామం!
మానవత్వాయ నమః
అక్షరాయ నమః



-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## అంతర్మథన సంధిగ్ధం
పుస్తక సమీక్ష


బోయిన భాస్కర్ రచించిన 'సందిగ్ధం' కవితా సంపుటిలో 34 కవితలు ఉన్నాయి. ఒక సంపుటి పరంగా చూస్తే ఇవి తక్కువ కవితలే కావచ్చు. కానీ ఇందులోని ప్రతి కవిత గొప్పదే.

సుమారు మూడు దశాబ్దాలుగా పాత్రికేయుడుగా ఉన్న భాస్కర్ అద్భుతమై నటువంటి కథలను రాశారు. ఆయన కథలకు ప్రతిష్టాత్మక పోటీలలో బహుమతులు కూడా వచ్చాయి. అయితే ప్రారంభంలో ఆయన కొంతకాలం కవిత్వం రాశారు. ఆయ న కవితలు రంజని కుందుర్తి అవార్డులు కూడా పొందాయి. కవిగా కొనసాగుతున్న సమయంలోనే కథలు రాయాలని ఆలోచన వచ్చిందేమో కవితల సంఖ్య కాస్త తగ్గింది.

అప్పట్లో రాసిన కవితలన్నీ కలిపి ఇలా సందిగ్ధం సంపుటిగా తీసుకువచ్చాడు. ఈ కవిలో అంతులేని బాధ ఉంది. ప్రతి కవిత సామాజిక నేపథ్యాన్ని కలిగి ఉంది. ఈ పుస్తకం చదువుతున్నప్పుడు సమాజం పట్ల తనకున్నటువంటి అవగాహన, పరిశీలన, అధ్యయనశీలత్వం మనకు అర్థమవుతుంది.

మనసు లోపల ఉన్నది ఉన్నట్టుగా రాసేటువంటి కవులు చాలా తక్కువ మంది ఉంటారు. దేని మీద రాయాలి? దేని మీద రాయకూడదు? అనేటువంటి అనేక లెక్కలు ఉంటాయి.

అనైతికం కవితలో భాస్కర్ మనకు




ప్రతులకు: స్కై ఫౌండేషన్, పద్మారావు నగర్, సికింద్రాబాద్. సెల్:8008573368

స్పష్టంగా కనిపిస్తాడు.

**"గుండెల మీద తూటాలు దిగబడటం కొత్తేం కాదు**
**దూది పింజల్లా ప్రాణాలు గాల్లో కలిసిపోవడం వింతేంకాదు**
**ఎన్కౌంటర్లు హత్యలు**
**ఈ చావుల పరంపర ఇక్కడ ఆనవాయితే"** అంటాడు.

ప్రజా ఉద్యమాల మీద ప్రభుత్వాలు చేసే ంవంటి దాడులు, అణచివేతలపై గొంతెత్తి రాసిన కవిత ఇది. మలి విడత తెలంగాణ పోరాటంలో ఎంతోమంది ఉద్యమకారులు మరణించారు.

ఎంతోమంది గాయపడి జైలు జీవితాలు గడిపారు. అలాంటి ఉద్రిక్త పరిస్థితుల గురించి ఈ కవిత చాలా గొప్పగా సాగింది.

పల్లెతండ్లాడుతోంది కవితలో..

**"నిద్రపోవడమేంటి?**
**నిద్ర పోవడమే మర్చిపోయింది పల్లె**
**పొద్దుగూకిన నుంచి**
**పొద్దు పొడిచే దాక బయోత్పాత కలవరమే**
**సాయం సంధ్య వేళ దొడ్లలోకి**
**తిరిగి వచ్చే గొడ్ల గిత్తల చప్పుళ్లతోనే**
**బూట్ల చప్పుళ్ళు మొదలై**
**పల్లెల గుండెల మీద స్వారీ చేస్తుంటాయి**
**వచ్చేది ఎవరో పోయేదెవరో**
**ఏ ఇంటి తలుపు విరుగుతుందో ఎవరి ప్రాణం మూడుతుందో తెలియని అయోమయం!"** అంటాడు.

ఈ కవిత చదువుతున్నప్పుడు మనకు అనేక విషయాలు తెలుస్తాయి. ఒకప్పుడు నక్సలిజం విస్తారంగా ఉన్న రోజుల్లో పల్లెలు ఎలా ఉండేవో, పల్లె జీవితాలు ఎంత దుర్భరంగా ఉండేవో, పోలీసుల అరాచకాలతో అమాయక ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడే వారో కళ్లకు కట్టినట్టుగా రాశారు. నిజంగా పల్లెలో జీవించిన వాళ్లకు ఈ విషయాలన్నీ తెలుసు. ఇప్పటి తరానికి ఈ విషయాలు చెబితే నమ్మలేని విధంగా ఉంటుంది. అలాంటివారు ఈ కవిత చదివితే అమాయక ప్రజలు ఎంత దుర్భరంగా జీవించారో అర్థమవుతుంది.

యుద్ధం అనే కవితలో..

**"ఇంతలో భళభళ మళ్లీ తెల్లవారుతుంది**
**నిద్దురపోని కళ్ళతోనే మళ్లీ వెతుకులాట**
**ఊరి పొలిమేరలో శవాలు చచ్చి పడుతున్నట్లే**
**మనసు పొలిమేరలోనూ అంతరాత్మలు చచ్చి పడుతుంటాయి**
**శవాల్ని దాటుతూనే ఆకలి కడుపుని భుజాన వేసుకొని ఉరుకులు పరుగులతో వేట మొదలవుతుంది**
**మళ్ళీ రాత్రి వరకు కడుపు నింపుకోవడం కోసమే వాళ్ళ యుద్ధం"** అంటాడు.

రోజువారి కూలీల పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. పొట్ట చేత పట్టుకొని బతుకుతెరువు కోసం నగరాలకు వచ్చిన వారు అడ్డమీద కూలీలుగా మారతారు. చాలీచాలని డబ్బుతో ఏదో ఒకటి తిని కడుపు నింపుకొని, అలా నడుము వాల్చి, మళ్లీ తెల్లారగానే కూలీ వెతుక్కునే పనిలో పడతారు. అలాంటి వారి జీవనశైలిని, వాళ్ళ ఆకలి పరిస్థితిని అద్భుతంగా వర్ణించిన కవిత ఇది.

ఇక సంపుటి శీర్షిక 'సందిగ్ధం' కవిత చాలా శక్తిమంతంగా రాశాడు.

**"దేవుడు ఒక్కడే మనిషి కూడా ఒక్కడే**
**నీవు నీవుగా నిర్మలంగా నిజాయితీగా బతుకు**
**దయ కలిగితే సాటివాడిని ఆదరించు**
**అనే దైవత్వాన్ని మనకు బోధించే మనుషులే నీతి తప్పి**
**మతాన్ని నెత్తిన వేసుకుని పిచ్చితో ఊరేగితే ఎలా?"** అంటూ ప్రశ్నిస్తాడు.

ఇవాళ సమాజంలో కులాల కంపు ఎంతగా ప్రభలుతుందో మనకు తెలుసు. ఇక మతాల గొడవల గురించి చెప్పడానికి వీల్లేనంత విధ్వంసం జరుగుతుంది.

ఇలాంటి విషయాపై కూడా తనదైన బలమైన గొంతును వినిపిం చాడు కవి.

ఇద్దరే ఇద్దరు కవితలో..

**"కులం తక్కువ వాళ్లమని నీతిమాలినోళ్లంతా**
**గుణపాల మాటలతో మా ఉనికి మీదనే పొడుస్తుంటే**
**నిందించకుండా అవమానాలతో ఎట్లా భరించగలం**
**కాలం మారిందన్న మాటలన్నీ నీతి బీరకాయలే**
**మా కష్టాల్ని వాడుకుంటూ కలిసి తిరుగుతూనే**
**అటు తిరిగి 'వీడుత్త కులం లేనోడు'**
**అంటూ చెవులు కొరుక్కోవడం**
**అంగవైకల్య మనసుల్ని చిత్రిస్తున్నది"**

ఇంకా ఈ సంపుటిలో.. జరంత చెప్పుండ్రి, ట్రై చేయలేమో, ఏడిచే గొంతుకలెన్నో వంటి చదివింపజేసే కవితలు చాలానే ఉన్నాయి.

ఈ కవిలో అద్భుతమైన అభ్యుదయ భావజాలం ఉంది.

మనసులో ఉన్న దుఃఖాన్ని అవివ్యక్తం చేయగల భాషా సామర్థ్యాలు గొప్పగా ఉన్నాయి.

ఈ కవి కథలు రాస్తూనే కవిత్వం వైపు కూడా దృష్టి పెడితే, అతడి నుండి మరిన్ని మంచి కవితా సంపుటాలు వస్తాయనే విశ్వాసం ఉంది.



-మౌనశ్రీ మల్లిక్
8919338546

## అంచనా వేయ తరమా

హృదయ విదారక
దుఃఖ సన్నివేశం...
కళ్ళారా చూసి
అనుభవంలోకి తెచ్చుకున్న అనంతరం
అసంకల్పితంగా వాళ్లకి
సమాజ ధైర్యం పట్ల ఆర్తి హెచ్చింది
ఆ ఆర్ద్రమైన పెనుగులాట ఫలితంగా
సంఘటితమైంది తరంగంలా యువతరం
వైవిధ్యమైన నేపథ్యం ఉన్న విద్యార్థి లోకం
ఎందరో ఎక్కడో చదువుకుంటున్న
చదువు పూర్తి చేసుకుని పరీక్షలు రాసిన
తరంగ్రాంతి కర సందర్భం
ఎదుర్కొంటున్న తనం
చిందరవందరై చెల్లాచెదురై
ఎటు దిక్కు తోచక ఒక దిక్కున ఒకచోట
గుమి కూడిన తరం
గద్దె మీది అధికారాన్ని ప్రశ్నిస్తూ
అన్యాయాన్ని నిలదీస్తూ
ఉజ్వలమైన మార్పుని నిశ్చితమైన కాలంలో
సంభవించాలని ఉద్యమిస్తున్న తరం
ఇది ఇన్నా తరం
పూర్తిగా డిజిటల్ యుగంలో పెరిగిన
పెరుగుతున్న తరం నవతరం
రీల్స్ లో తమ అంతరంగ భావాన్ని
వీలైనంత త్వరలో వెల్లడించాలని
పరివ్యాప్తి చేయాలని
ఉబలాట పడుతున్న తరం
ఉత్కంఠకు లోనవుతున్న తరం
ఉడుకు రక్తం ప్రవహిస్తున్న తరం.
ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో
భూమి ఆకాశాలు దద్దరిల్లేలా
గుండె లోతుల్లోని తడి మేఘమై
ఉద్వేగాల జడివానలా తుఫాను లా
విజృంభిస్తున్న తరం
అంతరాలని అధిగమిస్తున్న తరం
నవలోకాన్ని స్వాగతిస్తున్న తరం.

పిడికిలి బిగించాలి కానీ
ఆశని జారవిడుచుకోకూడ దనే తరం
శీత గిరి నుంచి సేతువు దాకా
ఒకే పిలుపుతో ఒక్కటై ఒక్క త్రాటిపై
పాలకవర్గాలకి కాక రేపుతున్న తరం
ప్రభుత్వం ఒక మెట్టు దిగేదాకా
పట్టుబట్టి పంతం నెగ్గించుకున్న తనం.
Gen Z తరం...
నవ్య పోకడలతో నవతరం అజెండాతో
నడుము కట్టిన తరం
చేయి చేయి కలుపుతున్న తరం
రాజ్యాధికారానికి కంటిమీద
కునుకు లేకుండా చేస్తున్న తరం
ఇంతటి చారిత్రాత్మక తరానికి
ఇనుమడించిన మద్దతుతో
ఉప్పొంగిన హృదయంతో
నా ఆత్మీయ కరచాలనం!!



-డా॥దామెర రాములు
9866422494


## అంతరంగ మథనం కవితా సంపుటిగా..
పుస్తక సమీక్ష

షేక్ మస్తాన్‌వలి కలం నుండి జాలు వారిన 27 కవితలు చిట్టిపొట్టివి. చీమ టపాకాయాల్లాగా బాగా ప్రేలాయి. ఇవన్నీ వలి భాయ్ అనుభవాలు, అనుభూతులు, జ్ఞాపకాలు, స్పందనలూ కలిసి కవిత్వంగా ఉద్భవించాయన్నారు. ఈ కవితలు ప్రగతి వార పత్రికలో, నవ్య వీక్లీ, ఆంధ్ర భూమి వార పత్రికల్లో ప్రచురిత మైనవే ఎక్కువగా ఉన్నాయి. మస్తాన్‌వలి కవితల్లో ఏదో చెప్పా లనే ప్రయత్నం మెండుగా వుంది. మడిసిపో యినా మంచి బతికి వుంటుందిరా బిడ్డా, అందుకే మడిసిగా మంచినే సేయాలిరా బిడ్డా అంటూ ఒక మంచి విషయాన్ని గుర్తు చేశారు. బతుకు నిజాలు బయల్పడినప్పుడు, నిండైన బ్రతుకు ఎండిపోతున్నప్పుడు, గుండె నిబ్బరాన్ని దండిగా పండించుకోవాలి, నీకు నీవై గెలవాలి, చేవ చూపి గెలవాలి అంటారు మరో కవితలో. యువశక్తి తప్పు దారి పడుతోం దనీ, ముప్పు తెచ్చిపెడుతుంది అనీ, ఇందుకు కారణం, **'బలముంది, తెలివుంది, మెప్పిం చే నేర్పుంది, కానీ అవకాశం లేక, ఆర్జన శూన్యం కాగా ఆకలి పెట్రేగి, సహనా నికి పరీక్ష'** పెడుతోందంటూ ఈ సమాజానికి ఒక సందేశ పూర్వకమైన జాగ్రత్తలను తెలియజేశారు.

**'బాపూ మళ్ళీ పుట్టాలి'** అన్న కవితలో నేటి సమాజపు స్థితిగ తులకు అద్దం పట్టారు. వయో ధికుల్లో ప్రతి ఒక్కరూ ఎదు ర్కొంటున్న సహజమైన తీవ్ర సమస్య, భార్యా భర్తల్లో ఎవ్వరో ఒకరు ముందు కాలం చేయగా, మిగిలిన ఒక్కరి జీవితం దుర్భ రంగా మారుతోంది. ఈ విష యాన్ని కవి చస్తూ బ్రతకాల్సిన అభాగ్యులు కాదు, వారంతా అనుభవ సంపన్నులు అంటారు. **'మిన్న'** అన్న రచనలో పదవినున్న కపటి చేసే చెడు గురించి చెబుతూ అది ఆర్పలేని అగ్ని కన్నా ప్రమాదకరమైందన్నారు. అంత రాత్మను గొంతు నులిమి, ఆత్మా భిమానం చంపుకొని, ఆశయాల ను అమ్మేస్తే అవకాశం అన్నారు. సిగ్గు వీడి నటిస్తే ప్రశంసగా మారి ఒదని, ఇవన్నీ మరుగుతున్న వ్యక్తిత్వాల షరతుల్లేని రాజీలు అన్నారు.

కారణం ఏదైనా సరే కాలం తో రాజీపడాల్సిందేననీ, ఎదురు తిరిగి గెలిచిన వారెవ్వరూ లేరన్నారు. కాలాన్ని శాసించేది ఒకరైతే, మనల్ని శాసించేది మాత్రం కాలమే అంటూ చెప్పుకొ చ్చారు.

చెదిరిన వుటలను చింపేస్తే జీవనపొత్తం కొత్తది అవుతుందా, చెదపట్టిన గతాన్ని చెరిపేస్తే అమ్మ ఒడి నుం డి బ్రతుకు ఆరంభం అవుతుందా? మనసు చెప్పే మంచి వింటే గతికి పట్టిన గ్రహణం గతమవుతుందా? ఇక ఐహికాలను అడుగంట వదిలితే అంతర్వేదన అంతం అవుతుందా అంటూ లోకానికే ప్రశ్న లు సంధించారు. ఈ విధంగా ప్రతి కవితలోనూ చుట్టూ వున్న సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తన ఆవేశాన్నీ, ఆవేదననూ, కవిత లుగా మలచి






ప్రతులకు: షేక్ మస్తాన్ వలి, ప్లాట్ నెం.46, అశోక్ కాలనీ విజయ హైస్కూల్ వెనుక కాప్రా, ఇ.సి.ఐ.ఎల్ పోస్ట్ హైదరాబాద్-500 062.

సాహితీ లోకానికి ప్రశ్నలు గా కొన్నింటిని సంధించారు.

షేక్ మస్తాన్ వలిగారి కవిత్వంలో మంచితనం మానవత నిజా యితీ ధోరణిలో దర్శనమిస్తుంది. వలీ గతంలో **'దీపం'** పేరిట కథా సంపుటిని అందించారు.

వలీగారి కుమార్తె పర్వీన్‌బాబి, ఎం. ఎ., సహకారంతో **'నే చెత్తను కాదమ్మా'** అన్న రచనలో కన్న నేరానికైనా నాపై కనికరం చూపమ్మా, దయచేసి నీ ఒడిలోకి చేర్చుకో అమ్మా, బ్రతుకు నిచ్చిన నీవు నన్ను బ్రతకనీయలేవా అమ్మా అంటూ వేడుకుంటూనే ఆపైన తన కోసం స్త్రీ జాతిని కాపాడి యుద్ధం ఏయు మనడంలో అంతరంగ మథనం దర్శనమిస్తుంది. అమ్మ, ఆడపిల్ల వ్యధలకు అక్షరరూపం ఈ కవితా పంక్తులు.

వల్లీగారి ఈ మొదట ప్రయత్నాన్ని మనం అభినందించవల్సినదే.



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

# గుల్ల సూర్యప్రకాష్ జీవిత సాఫల్య పురస్కారం



పురస్కార గ్రహితలను సత్కరిస్తున్న డా॥కె.వి.రమణాచారి, దూరదర్శన్ మాజీ డైరెక్టర్ పాలకుర్తి మధుసూధన్‌రావు, సినీ నటుడు సుబ్బారాయ శర్మ, లంకా లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, యస్.రామారావు, మల్లాది భాస్కర్, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురాం తదితరులు.

హైదరాబాద్, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జీవిత సాఫల్య, ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ గుల్ల సూర్యప్రకాశ్ జీవిత సాఫల్య పురస్కారం, ఎస్.బి. కిషోర్, నామాల మూర్తికి ప్రతిభా పురస్కారాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ మాజీ డైరెక్టర్ పాలకుర్తి మధుసూధన్‌రావు, సినీ నటుడు సుబ్బారాయ శర్మ, లంకా లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, యస్.రామారావు, మల్లాది భాస్కర్, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురాం పాల్గొన్నారు.

# మీరు దేశాన్ని ఉద్ధరించాల్సిన పని లేదు. ఒక్క పని చేయండి!




– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

అన్యకి ఆరోగ్యం బాగుండలేదని తెలిసి నేనూ విదూ పరుగులు తీసుకుంటూ హాస్పిటల్‌కి వెళ్ళాం. సిలైన్ పెట్టారు. ఏం జరిగింది అన్నాం. ఫుడ్ పాయిజినింగ్ అన్నారు. ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరిగింది అన్నాం. వారి బంధువుల ఇంట్లో ఫంక్షన్ అయితే వెళ్లారంట. అక్కడ భోజనాలు చేశాక వాంతులూ, విరోచాలు మొదలు. కనీసం యాభై మంది రకరకాల ఆసుపత్రుల్లో వున్నారు. ఇలాంటి వార్తలు వారానికి ఒకటి రెండు సార్లు ఎక్కడో చోట చదువుతుంటాం. ఇందుకు రకరకాల కారణాలుంటాయి. మేం పలకరించి వచ్చాం. నాలుగు రోజుల్లో అన్య కోలుకుంది. ఈలోగా మేం చాలా ఆందోళన పడ్డాం. ఎందుకంటే అప్పటినుండి ఎన్నో వార్తలు చదివాం. విన్నాం. టీ.వీ.ల్లో చూస్తున్నాం. కాఫీ పొడి, బియ్యం, మందులు, చాక్లెట్లు, ఒక్క మాటలో కల్తీ కానిదంటూ లేదు.

మేం ఐస్ క్రీమ్ తిందామనుకున్నాం. నెయ్యి వేసుకుందామనుకున్నాం. భయం కలిగింది. లోకంలో వున్న అన్ని వస్తువులను కల్తీ చేయటానికి గోడౌన్లు, మాఫియాలు, ఇలాంటి వారందరికీ రాజకీయ అండ దండలు. స్వచ్ఛమైన గాలి పీల్చలేం. చివరకి ప్రశాంతంగా చావటం కూడా కరదు. ఇలాంటి అసహ్యకరమైన, భీతి గొలిపే పరిస్థితులు ప్రపంచంలో ఎక్కడయినా వున్నాయా అనే అనుమానం వచ్చింది.

××××××

"మనం ఇప్పుడు ప్రధాన మంత్రికి, ముఖ్యమంత్రులకూ, రాజకీయ నాయకులకు, మేధావులకు మొత్తంగా ప్రపంచానికి లేఖలు రాయాలి" ఆవేశంగా అంది అన్య.

"ఏ విషయం గురించి?"

"ఇంకే విషయం కల్తీల గురించి."

"మనం ఈ విషయంలో ఎవరి సహాయమైనా తీసుకుందామా?" అన్నాడు విదూ.

"అంటే?"

"లేఖ చాలా పవర్ఫుల్‌గా రాయాలి కదా. మన మెంటార్ మిస్టర్ క్లీన్ గారో, మేంగో తాత గారో అయితే బాగా రాస్తారు కదా!" అన్నాడు విదూ.

"అవసరం లేదు. ఇప్పుడు జెన్ – జీ అంటున్నారు. లోకంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరిస్తామంటున్నారు. అలాంటిది మనం లేఖ రాయలేమా? అందులోనూ ప్రతి రోజూ మనం అనుభవిస్తున్నాం కదా – కనీసం లేఖ రాయక పోతే, ప్రశ్నించకపోతే ఈ సమాజం ఎలా మారుతుంది'' అంది అన్య సీరియస్‌గా.

"సరే. మనమే రాద్దాం" అన్నాను.

ఎవరికి చెందితే వారికి!

ఇది మకుటం. ప్రారంభ వాక్యం. మీరు దేశాన్ని ఉద్ధరించనవసరం లేదు. అవును. ఇది రాజకీయ నాయకులందరికి. అధికారంలో వున్నవారికి, లేనివారికి కూడా! ఒకరు దేశం వెలిగిపోతుందంటారు. మరొకరు బంగారం చేస్తానంటారు. ఇంకొకరు రానున్న ఇరవై సంవత్సరాల్లో ప్రపంచంలో మన దేశాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామంటారు.

ఎందులో మహానుభావులూ అంటున్నాం. కల్తీల్లోనా?

దేశానికి స్వాతంత్రం వచ్చి ఇన్ని దశాబ్దాలు అయింది. కనీసం మీరు కల్తీలేని వస్తువుని ఒక్కటి చూపించగలరా? ప్రతిరోజూ వందల నుండి వేల మంది ఈ కల్తీల బారిన పడుతున్నారు. ఆరోగ్యాలు పాడుచేసుకుంటున్నారు. చచ్చిపోతున్నారు. మీకు చీమ కుట్టినట్లుందా?

ఉదయం లేచిన దగ్గర్నుంచి పత్రికల్లో, టీ.వీ.ల్లో, సోషల్ మీడియాలో చర్చలే చర్చలు. వాగ్దానాలు, ఉచితాలు, సవాలక్ష ప్రకటలు. అప్పుడప్పుడు ఎక్కడో ఓ చోట ఎవరో ఒకరిని పట్టుకున్నట్లు చూపించటాలు. ఒక్కరికి శిక్ష పడుతుందా? వారి ఆస్తులు జప్తు చేశారా?

అంతదాకా ఎందుకు, పది మంది కల్తీగాళ్ళని రోడ్డు మీద నిలబెట్టి కాల్చేయండి. అప్పుడు చూడండి. ఇది ఉన్మాదం. ఇది ప్రజాస్వామ్యం అంటారా? మీ ప్రజాస్వామ్యం కల్తీ గాళ్లకా? మీ ప్రజాస్వామ్యం ఎంత డొల్లనో మనుషులకు తెలియదా? తిండి, వైద్యం, రాజకీయం, అధికారం, ప్రతిపక్షం – ఇందులో ఏది కల్తీ కాదు. మేధావులందరూ ఇలాంటి వాటి గురించి ఎందుకు మాట్లాడరు. ప్రజలంతా బయటికి వచ్చి ఈ కల్తీ విత్తనాలను, ఎరువుల్ని, మనుషులను ఎందుకు రోడ్ల మీదకు ఈడ్చుకురారు?

అసలు మీరు రేపటి తరానికి ఏం ఇవ్వాలనుకుంటున్నారు? అసలు మిమ్మల్ని రాజకీయాల్లోకి రమ్మందెవరు? మమ్మల్ని ఉద్ధరించమని వేడుకున్నది ఎవరు? లక్షలూ, కోట్లూ సంపాదించుకుంటున్నారు కదా. అయినా మీ ఆశకు అంతులేకుండా పోయిందెందుకు?

అవును. పిల్లలం అడుగుతున్నాం. ఈ కల్తీ నుండి మీరు బయటపడగలమని అనుకుంటున్నారు. అది మీ గడపలను దాటి ఇంట్లోకి, వంటగదుల్లోకి, మీ గదుల్లోకి వస్తోంది. మీరు, మీ పిల్లలు దీనికి అతీతులు కారు. మీ మనసులనూ, దేహాల్ని కల్తీలు కబలిస్తాయి. గుర్తుంచుకోండి.

అందరూ తలుచుకుంటే ఒక్క రెండు మూడు నెలలు చాలు – కల్తీ అనేది ప్రక్షాళన చేయటానికి. మీ దగ్గర పోలీసులున్నారు. సి.ఐ.డీ. లున్నారు. 'రా' లు వున్నాయి. వంద రకాల చట్టాలున్నాయి. మరి ఎందుకని మీరు వీటి మీద దృష్టి పెట్టడం లేదు. ఈ విషయంలో కూడా పిల్లలూ, జెన్–జీలు ముందుకు రావాలా?

అరేయ్ – కల్తీల్తో బతికే అధమ జాతి జనులారా! మీరు కూడా ఈ కల్తీలకే ఛస్తారు. మిమ్మల్ని వంద సంవత్సరాలు బతకమని అమ్మానాన్నలు పుట్టిస్తారు.

అర్థాయుష్షుతో చావటం ఏంటి రా? లివ్ అండ్ లెట్ లివ్ అంటారు కదా – మీరు బతకరు. ఇంకొకరిని బతకనీయరు.

పేదరికాన్ని భరించవచ్చు. కష్టాలను ఎదుర్కోవచ్చు. కానీ ఈ కల్తీలను భరించటం ఎలా? అందుకే అంటున్నాం.

"మీరు దేశాన్ని ఉద్ధరించనవసరం లేదు. రాత్రీ – పగలూ కష్టపడనవసరం లేదు. మీలాంటి వారంతా రాజకీయాల నుండి, అధికారం నుండి, అధికారం కోసం చేసే వికృత కార్యాల నుండి వెంటనే తప్పుకోండి. ఈ దేశానికి, ప్రపంచానికి జరిగే నష్టం లేదు.

అప్పుడు ఈ దేశ ప్రజలే నిర్ణయించుకుంటారు – తమ భవిష్యత్తు ఎలా వుండాలో! మీలాంటి వారికే కాదు, సామాన్యులకు కూడా రేపటి గురించిన విజన్ వుంటే ఎవరికి వారు తమని తాము ఉద్ధరించుకుంటారు.

వచ్చే వారం కలుద్దాం. ●

# వ్యవహారిక భాషా మార్గదర్శకుడు గిడుగు రామమూర్తి

–డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి



సభలో ప్రసంగిస్తున్న డా॥ఏనుగు నరసింహారెడ్డి. వేదికపై కళా జనార్ధనమూర్తి, బ్రాహ్మణపల్లి జయరాములు, సినీ దర్శకుడు గోస్వామి గోపాలకృష్ణ, చింతకింది విజయప్రసాద్.

హైదరాబాద్, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): గ్రాంథిక తెలుగు గ్రంథస్తం కావాలన్న తరుణంతో వ్యవహారిక భాషలో రాయొచ్చు అని ఆ దిశగా ఉద్యమించిన చిరస్మరణీయుడు గిడుగు రామ్మూర్తి అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు.

చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతులలో భాగంగా గురువారం సంఘ సంస్కర్త, రచయిత గిడుగు వెంకట రామ్మూర్తి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గిడుగు వెంకట రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

అనంతరం మాట్లాడుతూ ఇతర భాషా పదాలు విరివిగా తెలుగులో వాడుతున్నామంటే ఇందుకు రామ్మూర్తి తెలుగు గ్రాంథికం నుంచి వాడుకగా ప్రచారం కల్పించారని అన్నారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్త బ్రాహ్మణపల్లి జయరాములు, సినీ దర్శకుడు గోస్వామి గోపాలకృష్ణ, చింతకింది విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ
95021 56813



### నడి సముద్రంలో ఒంటరి నావ

తల్లిదండ్రుల ప్రేమ తర్వాత,
నా జీవితానికి ఆశ్రయమవుతావనుకున్నాను.
నా కన్నీటికి ఓదార్పువని,
నా అడుగులకు భరోసావని నమ్మాను.
తల్లిలా ప్రేమిస్తావనుకున్నాను,
తండ్రిలా కాపాడుతావనుకున్నాను.
ప్రియుడిగా నా మనసు అర్థం చేసుకుంటావని,
స్నేహితుడిగా జీవితాంతం
తోడుంటావని భావించాను.
నా ప్రపంచమంతా నీవేననుకున్నాను,
నా సర్వస్వాన్ని నీకే అర్పించుకున్నాను.
నిన్నే నమ్మి నా వాళ్లందరినీ వదిలి,
నీతోనే నా కొత్త లోకాన్ని నిర్మించుకున్నాను.
కానీ..
నడిసముద్రంలో నన్ను ఒంటరిగా వదిలి,
నువ్వు ఏ తీరం చేరావో తెలియదు.
నీ కోసం వచ్చిన నా ప్రయాణం,
నీతోనే ముగుస్తుందనుకున్న నా కథ,
నువ్వు వెళ్లిన క్షణంలో దిక్కులేని నావైంది.
ఇప్పుడు అలలు నన్ను ఎటు తీసుకెళ్తాయో
తెలియదు,
తీరం ఎక్కడుందో కూడా కనిపించడం లేదు.
నిన్నే నమ్మి బయలుదేరిన నా జీవన నావ..
నేడు తీరం చేరని నావగా మిగిలిపోయింది.

–తనూజ వెంకట్
గౌరీబిదనూరు

### తీరం చేరని నావ

సంసార సాగరంలో
తీరం చేరాలనే తపనలో
పయనిస్తుంది బతుకు నావ
కాలం దిక్సూచిగ మారి
మనిషిని సరంగిని చేసి
కష్ట ,సుఖాల అలలపై నడిపిస్తుంది.
సృష్టి నియమాన్ని మార్చలేని మనిషి
దృష్టిలో లోపం లేకుండా చేస్తు
కృషిని నమ్మి కర్మలు చేస్తే
కష్టాలు తీరి సుఖాన్ని దగ్గరకు చేరుస్తుంది
విలువల దారిలో నడిస్తే
తీరం చేరే మార్గం పూలబాటైతుంది.
కాలం ఆగని గడియారమై
పరుగుతీస్తుంటే
కడలి తరంగాల అలజడిలో
నావ సతమతమవుతున్నది
తీరాన్ని చేరాల్సిన నావ
భారంగా కదులుతు బాధకు
బంధువై నిరాశతో నిలిచిపోయినది.
లక్ష్యంతో సాగే జీవితం
రక్కసిలా దాడిచేసే సమస్యలు
సునామిని మించిన సమాజపు తూఫాను
ముందుకు సాగకుండా
బతుకు నావను అడ్డుకుంటుంటే
తీరం చేరకుండా ఒడిదుడుకుల అలలపై
తేలియాడుతున్నది.

–డా.బి.సుధాకర్

### అల్లంత దూరంలో ఆవలి ఒడ్డు

ఈవలి ఒడ్డున అందరి కోసం
వేచి ఉంటుంది చూడు
అది
రంగుల హంగులతో
ముస్తాబు అయింది చూడు
జనం పలక రింపులతో
పులకరించి పోతున్న నావ
నిండు గర్భిణీ లా నికార్సయిన పట్టుదలతో
నెమ్మదిగా ముందుకు సాగింది
ఎక్కడి వారి నక్కడ దింపేసి
ఒడ్డుకు చేరడమే దాని నిత్యకృత్యం
తెడ్లు ఎప్పటిలానే నీళ్లను
ఉపాయంగా వెనక్కి తరి మేస్తున్నాయి
హైలెస్సా హైలెస్సాఅంటూ
పాట జోరుగా వినిపిస్తుంది
ఆకాశం నిర్మలంగా నిశ్చింతగా
నీళ్ల వైపే చూస్తుంది
ఎప్పటిలానే దారి మధ్యలో
ఎన్నో ఆటు పోటులు
అయినా దిక్సూచి దిశలో భయం లేని
నావ నిశ్చింతగా వెళుతూనే ఉంది
ఎవరి రేవులో వాళ్ళను దింపుతూ
మరో తీరం వైపు సాగుతోంది నావ
చుట్టుపక్కల తోటి నావలను
అన్నింటినీ దాటేసి ముందుకు సాగుతోంది
అపుడే పడుతున్న వాన తుంపరలతో
నావ ముచ్చట్లు ఆపింది
నిశ్చలంగా ఉన్న ఆకాశాన్ని
నల్లని మేఘాలు కమ్ముకున్నాయి
అంతలోనే హోరు గాలి
రెప రెప లాడుతున్న తెరచాప
కొందరి కళ్ళు ఆకాశంలోకి తేరిపార చూసాయి
కొందరి చేతులు గంగమ్మను మొక్కాయి
అంతటితో ఆగిపోలేదు
పెళ పెళ మంటూ ఉరుములు మెరుపులు
నావ అటూఇటూ ఊగి పోతుంది
మునకలు వేస్తుంది పైకి తేలుతుంది
దిక్సూచి దిక్కు తోచక దిక్కులు చూస్తుంది
ఎవరికీ ఎవరి సాయం అందని పరిస్తితి
ఆలోచించలేని స్తితి గతి
అల్లంత దూరాన ఆవలి తీరం కనిపిస్తూనే ఉన్నా
నిస్సహాయంగా నావ
కలిసి రాని కాలంలో
తీరం చేరని నావలా
మిగిలి పోయిందిలా.

ఆ–లేటి పరంజ్యోతి
ఖమ్మం



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.
'ఈ వారం వచన కవితల వర్క్ షాపు"లో విజేతల కవితలు చదవండి

–డా॥రావి రంగారావు
9247581825

–సంపాదకులు

### కోరికలు

అసలే అలలపై ప్రయాణం...
లెక్కకు మించి
కోర్కెలను ఎక్కించుకుంటే
బరువెక్కిన బతుకు నావ
మునగక తప్పదు.
కోరికలూ గాలిపటాలే...
వ్యసనాల
కొమ్మల్లో చిక్కుకోకుంటేనే
లక్ష్యాల మార్గాన
స్వేచ్ఛగా విహరించగలిగేది.
కోరికల బీరువాకు గట్టిగా తాళం
వేస్తేనే
ప్రాయం పదిలం,
దురాశల దొంగల చేత చిక్కితే
పైకెత్తాల్సింది చేతులే.
దేహానికి ప్రాణ వాయువుని
మోసుకెళ్లే
ధమనులు అవ్వాలి కోరికలు,
ప్రాణ సంకటాన్ని కలిగించే
ద్రోహులు మాత్రం కాకూడదు.
అవసరాల హద్దులు దాటిన
కోర్కెలను గారాబం.
చేస్తూ పోతుంటే
మనసు చెడిపోక తప్పదు
మనిషి పడిపోక తప్పదు

–తమ్మా ధనుంజయ రెడ్డి
9908734363

### కోరికలు

కొన్ని కోరికలు సీతాకోక చిలుకలు
అలా చూసి వదిలెయ్,
కొన్ని కోరికలు సాలీడు గూళ్ళు
దూరంగా నిలిచెయ్,
కొన్ని కోరికలు చెడుదారికి బాటలు
ముందడుగు ఆపేయ్,
కొన్ని కోరికలు చెద పురుగులు,
మదిగదిలోంచి నెట్టెయ్...
కొన్ని కోరికలు పోటీ పరీక్షలు,
ప్రయత్నించి గెలిచెయ్,
కొన్ని కోరికలు
రంగుల గాలిపటాలు,
సరదాగా ఎగరెయ్...
కొన్ని కోరికలు కొనగలిగే
మిఠాయిలు,
అందుకొని ఆస్వాదించవోయ్...
కొన్ని కోరికలు అందని ద్రాక్షలు
పుల్లటివని వదిలెయ్
అన్ని కోరికలు పరుగెత్తే గుర్రాలు
కళ్ళెం ఎపుడూ వదలకోయ్
రహదారి వైపు త్రిప్పవోయ్
అదుపులో ఉంచవోయ్
కుదుపులను ఆపవోయ్
హాయిగా బ్రతకవోయ్.

–గోలి హనుమచ్ఛాస్త్రి
8500222048

### కాంక్షల దర్పణం

హృదయపు నిశ్శబ్ద తీరాలపై
అలలై ఎగసే అంతులేని కోరికలు,
కన్నుల సరస్సులలో కలల కుసుమాలై
విరిసే రంగుల రాగాలు!.
కాలమనే కీకారణ్యంలో
కనిపించని విత్తనాలై మొలిచే కాంక్షలు,
మనసు దర్పణంలో నిత్యం ప్రతిబింబించే
నిగూఢ స్వప్నాలే జీవన రేఖలు!.
ఇంద్రధనుస్సు రంగులద్దుకుని
కంటిపాపల గూటిలో ఊగే కలల ఊయలలు,
ఎడారి ఎండల్లో దూరాన మెరుస్తూ
మాయమయ్యే మృగతృష్ణల జలాలు!.
కొన్ని చిగురించే ఆశలు...
కొన్ని చితిమంటలై రగిలే ఆరాటాలు,
కోరికల రంగస్థలంపై మనిషి
రాసుకునే తన జీవిత గాథలు!.
దిశ దొరికిన పాదాలకు పరుగే పథమై,
గమ్యం గుండెలో దీపమవుతుంది,
శ్రమ చెమట చుక్కలతో కలిసిన కాంక్షే
కాలాన్ని జయించే శక్తి అవుతుంది!.
హద్దులు దాటిన ఆశ మాత్రం
అగ్నికణమై అంతరంగాన్ని దహిస్తుంది,
అదుపు తప్పిన కాంక్ష దావానలమై
జీవన వనాన్నే బూడిద చేస్తుంది!.
వాన కురిసినంత మాత్రాన
ప్రతి ప్రవాహమూ ఉప్పెనై తీరాన్ని ముంచదు,
ఆశ పుట్టినంత మాత్రాన
ప్రతి కలా జీవిత గమ్యమై మారదు!.
తడవాలి...
కానీ కొట్టుకుపోకూడదు;
ఎగరాలి...
కానీ నేలను మరవకూడదు,
కోరాలి...
కానీ కోరికల సంకెళ్లలో మనిషి
తనను తాను కోల్పోకూడదు!
స్వార్థపు గోడలు దాటి
సాటి మనిషి కన్నీటిని
చిరునవ్వుగా మార్చే కోరిక,
అంధకారపు గుండెల్లో వెలుగై,
ఒంటరి ప్రాణానికి ఓదార్పై నిలిచే కోరిక!.
ఎందరో జీవితాల్లో ఆనందం నింపే
నిస్వార్థ కాంక్షే నిజమైన సంపద,
మానవత్వపు మౌన మందిరంలో
ఎప్పటికీ వెలిగే అక్షయ దీపం!.
కోరికలు ఎన్నున్నా మనిషిని కొలిచేది
అతని కలల ఎత్తు కాదు,
తన కోసం ఎంత కోరుకున్నాడనేది కాదు...
పరుల కోసం ఎంత వెలుగు కోరాడనేదే!.
కాంక్షకు కరుణ తోడై,
కలలకు కర్తవ్యం జతై,
జీవితం పరిమళిస్తే?
అప్పుడే కాంక్షకు అర్థం...
కలలకు కాంతి...
జీవితానికి జయం!

– పేర్లి దాసు
9963249775

### కోరిక(అల)లు

ఆశల అంచుల్లో చిగురించే
అంతులేని ప్రవాహం కోరిక...
మనసు సముద్రమైతే,
అలలే కోరికలు...
ఒక అల ఒడ్డును తాకి
మాయమయ్యేలోపే
మరో అల తీరం వైపు
పరుగులు తీస్తుంది,
కోరికల సుడిగుండంలో
కొట్టుకుపోవడమా,
కోరికల అలలపై సవారీ చేస్తూ
ముందుకు సాగడమా...
ఆకాశంలో నక్షత్రాన్ని కోరుకో,
తప్పు లేదు కానీ
చేతుల్లోకి వచ్చేసరికి
మెరుపు కోల్పోతుందేమో...
కావలసింది దక్కితే లభించేది
కాసేపటి తృప్తి మాత్రమే,
కొన్ని కోరికలు రెక్కలొచ్చి
ఎగిరిపోవాలనుకుంటాయి,
మరికొన్ని గుండె లోతుల్లో
శ్వాసగా మిగిలిపోతాయి...
రేపటి ఆశల ద్వారం దగ్గర నిలిచి
నిరంతరం చూసే నిశ్శబ్ద నేత్రం
కోరిక,
మనసులోని ఆశల తోటలో
కొన్ని కోరికలు అందమైన
పూలై వికసిస్తాయి..
మరికొన్ని ముళ్ళై
గుండెను గుచ్చుతాయి...
కోరిక
పరుగెత్తించే ఇంధనం,
చీకటి తరిమే దీపమైనా కావచ్చు,
జీవితాన్ని దహించే
కార్చిచ్చైనా కావచ్చు...
దారి తప్పించే చిమ్మచీకటీ అదే...
గమ్యం వైపు నడిపించే వెలుగూ
అదే...

–వక్కలగడ్డ వేంకటేశ్వర రావు
9849559581.

### కోరికలు అనంతాలు

కోరికలు
గుండెలో గుసగుసలాడే గీతాలు,
కనురెప్పలపై విరిసే కలల పూల తోటలు.
చేరని తీరాల వైపు పిలిచే అలలు,
చీకటి దారుల్లో వెలిగే ఆశల వెలుగులు...
చిన్న కోరికైనా చిన్ని చుక్కలా మెరుస్తుంది,
పెద్ద ఆశైనా ఆకాశమంతా పరుచుకుంటుంది.
మనసు లోతుల్లో పుట్టిన ప్రతి తపన,
జీవితానికి నేర్పుతుంది కొత్త నడక...
కోరికలే లేకుంటే కలలకు రెక్క లెక్కడ?
ఆశలే లేకుంటే అడుగులకు దారు లెక్కడ?
పడిపోతే లేపేది ఓ మధురమైన ఆశ,
ఓడిపోతే గెలుపు చూపేది అదే విశ్వాసం...
కొన్ని కోరికలు కన్నీటి ముత్యా లవుతాయి,
కొన్ని ఆశలు నవ్వుల పువ్వులై వికసిస్తాయి...
నెరవేరని కలలూ వ్యర్థం కావు ఎప్పుడూ,
అవి నేర్పిన పాఠాలే మనసుకు వెలుగులు...
కోరిక
కేవలం పొందాలనే ఆరాటం కాదు,
మనలోని మంచిని మేల్కొలిపే పాట కూడా...
తనకోసం కోరినదానికంటే గొప్పది ఏమిటంటే?
ఇతరుల సంతోషంలో తన సంతోషం వెతకడం...
మనసు మంచిదైతే కోరిక పుష్పమవుతుంది,
ఆశయం ఉన్నతమైతే జీవితం సుగంధ మవుతుంది.
కోరికలకి కృషిని తోడుగా చేసుకుంటే
కలలన్నీ ఒకరోజు నిజాలై నవ్వుతాయి!
కోరికలు ..జీవిత మధుర సంగీతం,
ఆశలు.. హృదయానికి అనంత వసంతం.
కలలు కని, కృషితో వాటిని చేరుకున్నప్పుడు?
మనిషి జీవితం? నిజంగానే ఒక అందమైన కవిత
అవుతుంది!

–డా రావినూతల భరద్వాజ

## తెలుగింటి దరహాసం

పొరుగింటి పుల్లకూర రుచి అన్నట్లు
పరభాషల మాధుర్యాన్ని
చవి చూసిన తెలుగువారికి
మన ఇంటి రుచి పాకాలు జిహ్వను తాకటంలేదేమో
నిరంతరం అన్య భాషీయులను
మెప్పించాలనే ఆకాంక్షకు
అడ్డుకట్ట వేయాలనే సంకల్పం
విస్తృత దారిలో పయనించగలిగితే
తెలుగింటి దరహాసం
విశ్వజనీయుల దృష్టిలో
పరిహాసం పాలు కాదు
మండు వేసవిలో వట్టివేళ్ళ చాపలపై
కాసిని నీళ్ళు చల్లితే
సుగంధాలు వ్యాపించినట్టే
తెలుగమ్మ భుజాలను కాసింత తట్టితే చాలు
పలుకుల పరిమళాలను
విశ్వమంతా వ్యాపింప చేస్తుంది
వెలుగుతున్న జ్యోతి
మరో దీపాన్ని వెలిగించిన రీతిగా
తెలుగుజ్యోతి ఎన్నెన్నో వెలుగులను
ఖండఖండాంతరాలలో పంచుతున్నదిపుడు
గారాలు పోయినా బీరాలు పలికినా
అది అచ్చ తెలుగైతే
అమృత ప్రాయమవుతుంది
పసిపాప ముద్దు ముద్దు మాటలు
వినసొంపు తెలుగు భాషలోకాక
మరే భాషలో వుంటాయి
ప్రేమలేఖలు తన సహజత్వాన్నీ సౌందర్యాన్నీ
తెలుగుభాషకు కాక
మరే భాషకు అద్దుతాయి
గోదారమ్మ అంతర్వేదిలో అంతర్ధానం కాదు
తెలుగు కవిత్వధారలతో సముద్రాన్ని నింపి
ప్రపంచ దేశాలలో ప్రవహింప చేస్తుంది
కృష్ణవేణి పయనం హంసలదీవితో ఆగిపోదు
దివిసీమలోని ఆ మహనీయుడందించిన
తెలుగింటి ఫలాలను
నలుదిశలా పంచుతుంది.

పొత్తూరి సుబ్బారావు
సెల్:94907 51681



## తెనుగు(ధ)దనం

తేనెపలుకులు నేర్చిన భాష తెలుగుభాష
విశ్వవిఖ్యాతి గన్నది ఇది విమలభాష
అమ్మే ప్రథమం తెలుగే వైభవం
అమ్మతనమే తెనుగుదనం
అచ్చుల్లో అందంచూడు
హల్లుల్లో హాయిని చూడు
వల్లెవేస్తూ తెలుగు పదాలను
ఆరగించాలి పిల్లలు గోరుముద్దలు
మాటసత్యం తెలుగు నిత్యం
ఈ నినాదాన్నిచేద్దాం మనం సత్యంసత్యం
గిడుగు గురజాడ అడుగుజాడల్లో
మన తెనుగు ప్రాభవం
వెలిగిపోవాలని కోరుకుంటూ.

–గరిమెళ్ల కాశీఅన్నపూర్ణ
9618586277





కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## గిడుగు తెలుగు వాడుక భాషకు గొడుగు

తెలుగు ఓనామాల నడుగు ఆ గిడుగు అడుగుల జాడలుండు
తెలుగు జాతి యందు!
పలుకుబడులకే పట్టంబు గట్టేటి భాష ఉద్యమానికి బాపుతాను,
తెలుగు వాడుక భాష రక్షణకు- పరిరక్షణకు దాపు మనము!
గిడుగు గ్రాంథిక భాషల్లో పిడుగు,
వాడుక భాషలకు గొడుగు!
వాడుక భాష నందున్న అందాన్ని,
దాన్ని పలకడంలోనున్న ఆనందాన్ని
తెలుగు వారికి తెలియజేసిన ఘనుడు!
పండితుల పంచలకే పరిమితమైన గ్రాంథిక భాషను,
పల్లె పట్టణ పామరులకు సైతం అందించిన ఒడుగు!
తెలుగు వాడుక భాషకు ఇతను ఆధ్యుడు ఆరాధ్యుడు,
సవర భాషా పాండిత్యంలో ఘనపాటి దురంధరుడు!
తెలుగు వాగ్దేవి తల్లికి వ్యవహారిక పదాలతో
పట్టుబట్టి పట్టు బట్టను సమర్పించిన సద్గురుడు!
తెలుగు నేల మాగానంలో వాడుక పోరాట భాష విత్తనాలుచల్లి,
సేద్యం చేసిన హాలికుడు!
అవి మొలకెత్తి మొక్కలై, మానులై తెలుగు వెలుగులు నలుదిశలా
వెదజల్లుతుంటే తన్మయ అనుభూతిని పొందిన తెలుగు వాడుక
భాషోద్ధరణ ఉద్ధారకుడు! తెలుగు వాడుక భాషా సేద్యం
గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారికి సాధ్యం!!

-డాక్టర్ గోగు వెంకటేశ్వర్లు
+91 94904 40714

## తెలుగును వెలిగిద్దాం

ఆకాశమంత విశాల భావం కలిగి వెలుగు
పుడమి తల్లి ఒడిలో అనంత మొలకలుగా
నిత్య నూతన ప్రకృతి వలే పరిమళిస్తూ
తర తరాల గుండెల్లో నిలిచెను మన తెలుగు!.
కోయిల గానంలో మధుర గానమై
మన సంస్కృతికి జీవనమైన భాష
ప్రభాత భానుని కిరణంలా వెలుగునిచ్చేది
ఊపిరి ఉన్నంతవరకు జ్ఞానమై తోడుండేది!.
అమ్మా అనే పదంలో వినిపించే కమ్మదనం
ఆప్యాయతను కురిపించే వాన చినుకుల్లా
అక్షరం అక్షరంలో అల్లుకున్న ప్రేమగుణం
పదం పదం మధ్యలో దాగిన మమతల ముత్యం!.
విశ్వమందు వేరే భాషలు ఎన్ని ఉన్ననూ
మన మాతృభాషను మరువక జీవిద్దాం!
లోకాన కొత్త భాషలు ఎన్నో నేర్చుకున్ననూ
మన తెలుగు తల్లిని గుండెల్లో నిలుపుదాం!.
పల్లె పలుకులలో అనుభూతులు పంచుతూ
ప్రపంచ నలు దిశలు మన మూలాలు నిలుపుతూ
వేల భావాలకు శ్వాసగా నిలిచే తెలుగును
లయబద్ధంగా నిశ్శబ్దంలో నాదమై పలికిద్దాం!.
ఇంపైన పలకరింపులో అనురాగం నింపు
ఉజ్వలమైన ఉషా కిరణాల మేలుకొలుపు
కలలకు రెక్కలిచ్చే ఖగోళములో వెలుగై,
కవుల కలాలకు కదలికనిచ్చేది మన తెలుగు!
తెలుగును వెలిగిద్దాం!
తెలుగు సాహిత్యాన్ని కలకాలం నిలబెడదాం!

-మోదేపల్లి శీనమ్మ

## గిడుగు నగిశీలు

దేశ భాషలందు తెనుగు లెస్స,దేవరాయల ఉవాచ!
గొప్ప గొప్ప కవుల మూలాన తెలుగు ఉన్నత స్థాయికి!
కాలక్రమేనా తెలుగు మూలన పడి చతిగిలబడింది!
ఆంగ్లమను పరభాష వ్యామోహంలో కొట్టుమిట్టాడారు!.
శ్రీనాథుడు, నన్నయ, పోతన,తిక్కన, గుర్రం జాషువా,
సినారె, గిడుగు రామ్మూర్తి,దేవులపల్లి కృష్ణశాస్త్రి,
కాళోజీ, శ్రీ శ్రీ, ఆరుద్ర, ఆత్రేయ, చాసో, వేటూరి!
ఎందరో మహానుభావులు తెలుగుకు అందాలద్దారు!.
తెలుగు సౌందర్యం కవుల మస్తిస్కాలకే తెలుసును!
వారి కవిత్వంలో మహోన్నత రీతిలో ఉట్టిపడుతుంది!
తెలుగు చోటు చేసుకోవడం కవిత్వంలోనే కాదు!
యథార్థ జీవిత ఒరవడిలోనికి యదేచ్ఛగా రావలెను !.
తెలుగు సాహిత్యాన్ని పరిరక్షించాలనే అకుంఠిత దీక్ష!
ప్రతి తెనుగోడి ఊపిరై కొనసాగాలి ప్రభంజనంలా!
పర భాషా వ్యామోహాన్ని విడనాడాలి సమూలంగా!
జీవనాధారం కోసం అభ్యసించక తప్పదు!.
మాతృభాష తెలుగు మన తల్లి, మన ప్రేగు, మన బంధం!
తెలుగు మన ఊపిరి, మన ప్రాణం, మన భవిష్యత్తు!
మన భాష తెలుగును మనవే ప్రరిరక్షించుకోవాలి
బాధ్యతాయుతంగా!

-క్రిష్టంశెట్టి సుబ్బారావు
9490747939.

## తెలుగు భాష ఔన్నత్యం- దాని ప్రాచుర్యం

తొలుత తెలుగు భాష ద్రావిడ భాషగా ప్రాచుర్యం పొందినప్పటికీ..,
తెలుగు భాష లోని ఔన్నత్యం ప్రపంచ వ్యాపితం.!.
ఎందరో మహనీయులు తెలుగు భాష అక్షరములను అందముగా మలిచి..,
సౌందర్యమైన శబ్ద అలంకారాలతో గ్రంథములు చేసిరి ...!.
ఏ పదానికైనా ఓ ప్రత్యేకత ఉండే పొందికలను వేసి ..,
భాషకు వన్నెలు తెచ్చిపెట్టిన సాహిత్య సమరయోధులు ఎందరో...!.
అందు గిడుగు రామ్మూర్తి గారి పాత్ర కొలమానానికి అందనిది..,
అవని భాషగా మార్పు కోరుతూనే.. గ్రాంధికం నుండి జానపదం కోసం చేశాడు సమరం..!
తిక్కన పోతన ఎఱ్ఱన గారి గ్రంధావిష్కరణలు..
తెలుగు తీయందనానికి తీపి గురుతులు..!.
పోతన గారి భాగవతంలో సంస్కృతాంధ్రం మిలితమై..
ముందు తరాలకు అమృతాంధ్రమును పంచిన సౌందర్య సౌరభం భాగవతం..!.
ఇట్టి గొప్ప శబ్ద అలంకార భూషిత తెలుగు భాషని ..,
కవుల కలంలో దారి తప్పుతున్న సమాజానికి తెలుపుతూ..
అత్యున్నతమైన తెలుగు భాషను పరి రక్షిస్తూ..
తెలుగు తేజమును తెలుగు వారి సంస్కృతిని జగతికి చాటాలి..!

-గూండ్ల నారాయణ
9441678733

# అమెరికా తలుపులు మూసుకుంటున్నాయా?

అమెరికా అంటే మన పిల్లలకు ఒక దేశం కాదు.. ఒక కల. ఆ కల కోసం జగిత్యాల నుంచి జగ్గయ్యపేట వరకు.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు.. దేశంలోని ఎన్నో కుటుంబాలు తమ పిల్లల అమెరికా చదువుల కోసం పొలాలు అమ్మి, అప్పులు చేసి, బ్యాంకుల్లో విద్యా రుణాలు తీసుకుని తమ భవిష్యత్తును పణంగా పెడుతున్నాయి. చద .. ఆ తర్వాత ఉద్యోగం.. అక్కడే జీవితం. గత మూడు దశాబ్దాలుగా నడుస్తున్న ఈ దారిలో ఇప్పుడు బోర్డులున్నాయి. **"త్వరగా రండి.. లేకపోతే కష్టం"** అనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

రెండు పరిణామాలు ఇప్పుడు ప్రతి ఇంట్లో చర్చకు వస్తున్నాయి. ఒకటి.. సెప్టెంబర్ 15లోపు అమెరికా చేరుకోవాలన్న హడావుడి. రెండోది.. హెచ్-1బీ వీసాకు ఏకంగా 1,03,265 డాలర్ల అదనపు రుసుము ప్రతిపాదన.

ఆగస్టు 24న అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ ఫెడరల్ రిజిస్టర్‌లో ఉంచిన ప్రతిపాదన ప్రకారం, సాధారణ హెచ్-1బీ రుసుముకు అదనంగా ఈ భారీ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. సాధారణ 65 వేల వీసాల పరిమితితోపాటు అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఉన్నత డిగ్రీ పొందిన వారికి కేటాయించే మరో 20 వేల వీసాలకూ ఇది వర్తించనుంది. అయితే వీసా పరిమితి నుంచి మినహాయింపు పొందిన దరఖాస్తులకు ఈ అదనపు రుసుము వర్తించదు. ఇది ఇంకా తుది చట్టం కాదు. 30 రోజుల ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అసలు ఆలోచించాల్సింది లక్ష డాలర్ల గురించి మాత్రమే కాదు. ఒక మనిషి ప్రతిభకు ఇంతటి ధర కడితే దాని ప్రభావం ఏమిటన్నదే.

## భారతీయులకే ఎందుకు ఎక్కువ ప్రభావం

హెచ్-1బీ వీసా దరఖాస్తుల్లో భారతీయుల వాటా అత్యధికం. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆమోదిత హెచ్-1బీ పిటిషన్లలో భారతీయుల వాటా దాదాపు 71 శాతంగా ఉంది. అందుకే అమెరికా వలస విధానంలో చిన్న మార్పు వచ్చినా దాని ప్రకంపనలు ముందుగా భారతదేశంలోనే కనిపిస్తాయి.

## అమెరికా చిన్న దగ్గు తీసినా.. మనకు జలుబు చేసినట్టే!

ఇది కేవలం వీసా సమస్య కాదు. అమెరికాలో చదువుతున్న విద్యార్థి వెనుక ఒక కుటుంబం ఉంటుంది. ఒకరి కల కోసం తల్లిదండ్రుల పొదుపు, బ్యాంకు రుణం, ఆస్తి, అప్పు.. అన్నీ పెట్టుబడిగా మారతాయి. చదువు పూర్తయ్యాక ఉద్యోగం వస్తే ఆ రుణం తీర్చుకోవచ్చు. లేకపోతే అదే కుటుంబానికి ఆర్థిక భారం అవుతుంది. అందుకే అమెరికా విధానంలో వచ్చే ప్రతి మార్పును భారతీయ కుటుంబాలు ఇంత తీవ్రంగా గమనిస్తున్నాయి.

## ఈ బంధం నిన్న మొన్నటిది కాదు

అమెరికా-భారత విద్యా బంధానికి స్వాతంత్ర్యం తర్వాతే అధికారికంగా బలమైన పునాది పడింది. 1950లో భారత్, అమెరికాల మధ్య విద్యా మార్పిడి కార్యక్రమాలకు సంస్థాగత బాట ఏర్పడింది. ఆ తర్వాత ఉన్నత విద్య, పరిశోధన, విజ్ఞాన రంగాల్లో ఇరు దేశాల అనుబంధం పెరిగింది. మొదట కొద్ది మంది విద్యార్థుల ప్రయాణంగా మొదలైన ఈ ప్రవాహం కాలక్రమంలో భారీ విద్యా ఉద్యమంగా మారింది.

సాంకేతిక విద్య, సమాచార సాంకేతిక రంగాల విస్తరణతో అమెరికా భారతీయ యువతకు మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా మారింది. చదువు తర్వాత శిక్షణ, ఉద్యోగం, పరిశోధన, వృత్తి అవకాశాలు ఈ సంబంధాన్ని మరింత బలపరిచాయి. 2024-25 విద్యా సంవత్సరంలో అమెరికాలో 3,63,019 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారంటే ఈ అనుబంధం ఎంత విస్తరించిందో అర్థమవుతుంది.

ఇప్పుడు అదే ప్రయాణం కొత్త నిబంధనల ముందు నిలబడింది.

## సెప్టెంబర్ 15.. ఎందుకీ హడావుడి

ఎఫ్-1 విద్యార్థులు, జె-1 విద్యావేత్తల ప్రవేశానికి సంబంధించి అమెరికా కొత్త విధానాన్ని తీసుకొస్తోంది. ఇప్పటివరకు ఉన్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' విధానానికి బదులుగా నిర్దిష్ట కాలపరిమితి విధించే నిబంధన సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి రానుంది. కొత్త విధానంలో అమెరికాలోకి ప్రవేశించే వారికి కోర్సు వ్యవధి లేదా నిర్ణయించిన గరిష్ఠ కాలానికి అనుగుణంగా గడువు ఉంటుంది. అదనపు సమయం అవసరమైతే ప్రత్యేక ప్రక్రియను అనుసరించాల్సి రావచ్చు.

అందుకే కొన్ని విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ విద్యార్థులకు సెప్టెంబర్ 15లోపు అమెరికా చేరుకోవాలని సూచిస్తున్నాయి. విదేశీ చదువు అంటే కేవలం తరగతులు, పరీక్షలతో ముగిసేది కాదు. పరిశోధన, ప్రాజెక్టులు, శిక్షణ, ఉద్యోగ అన్వేషణకు సమయం అవసరం. ప్రతి దశలో కొత్త అనుమతులు, అదనపు వ్యయాలు పెరిగితే మధ్యతరగతి కుటుంబాలపై భారం తప్పదు.

దీనికి తోడు ఎఫ్-1 విద్యార్థుల ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్‌పైనా భారీ రుసుము విధించే ఆలోచనపై చర్చ జరుగుతోంది.

అది అమల్లోకి వస్తే చదువు తర్వాత అమెరికాలో పని అనుభవం పొందాలనుకునే విద్యార్థులకు మరో ఆర్థిక అడ్డంకి ఏర్పడుతుంది.

ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉంది. అమెరికా ప్రపంచంలోని ప్రతిభావంతులను ఆకర్షించి దాని ఆర్థిక వ్యవస్థకు ఉపయోగించుకుంటూ వచ్చింది. ఇప్పుడు వీసా రుసుములు, కఠిన నిబంధనలు పెరిగితే ప్రతిభావంతులైన విద్యార్థులు ఇతర దేశాల వైపు మళ్లే అవకాశం కూడా ఉంది. కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. అమెరికా విధాన మార్పులు చివరకు అమెరికాకే ఎంత ప్రయోజనం ఇస్తాయో కాలమే చెప్పాలి.

## అసలు మనం మర్చిపోతున్న ప్రశ్న

అమెరికా వెళ్లడం తప్పు కాదు. ఉన్నత విద్య చదవడం తప్పు కాదు. మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడటం కూడా తప్పు కాదు. ప్రపంచాన్ని చూడాలి. కొత్త సాంకేతికత నేర్చుకోవాలి. మంచి జీవితం నిర్మించుకోవాలి. కానీ ఆ ప్రయాణంలో మనుషులను, ముఖ్యంగా మనల్ని పెంచిన తల్లిదండ్రులను మర్చిపోవడం మాత్రం విజయానికి కొలమానం కాకూడదు.

ఒక తండ్రి తన కొడుకును అమెరికా పంపడానికి జీవితమంతా కష్టపడతాడు. పొలం అమ్ముతాడు.. అప్పు చేస్తాడు.. బ్యాంకులో విద్యా రుణం తీసుకుంటాడు.. తన సౌకర్యాలను త్యాగం చేస్తాడు. కొడుకు అక్కడ స్థిరపడిన తర్వాత నెలకు రెండు వీడియో కాల్స్‌తో బంధం ముగిసిపోకూడదు.

తండ్రికి అనారోగ్యం వచ్చినా.. తల్లి ఆస్పత్రిలో ఉన్నా.. పక్కన ఉండలేని పరిస్థితి రావచ్చు. చివరికి వారు కన్నుమూస్తే చివరి చూపు కూడా చూడలేక వీడియో కాల్‌లో అంత్యక్రియలు చూసే దుస్థితి ఏ తల్లిదండ్రులకూ రాకూడదు.

అదే కొడుకు, కోడలికి సంతానం పుడితే మాత్రం తల్లిదండ్రులే గుర్తుకొస్తారు. డెలివరీ సమయంలో అమెరికా వెళ్లాలి. నెలల తరబడి వండి పెట్టాలి. మనవడిని చూసుకోవాలి. కోడలికి అండగా నిలవాలి. బాధ్యత పూర్తయ్యాక మళ్లీ స్వదేశానికి రావాలి.

ఇది కుటుంబ బంధమా? లేక అవసరానికి అనుగుణంగా బంధాలను ఉపయోగించుకునే జీవన విధానమా?

డబ్బు కావాలి.. భవిష్యత్తు కావాలి. కానీ కన్నవారిని కన్నీళ్లలో వదిలి సంపాదించే డాలర్లకు విలువ ఎంత? మన సంస్కృతిలో తల్లిదండ్రులను ప్రత్యక్ష దైవాలుగా భావిస్తాం. ఆ దైవాల చివరి రోజుల్లో పక్కన నిలబడలేని దూరం మన అభివృద్ధికి ప్రశ్నార్థకం కాకూడదా?

అమెరికా వెళ్లడం తప్పు కాదు. కానీ కన్నవారిని కన్నీళ్లలో వదిలి అక్కడ స్థిరపడటమే విజయమా? అన్న ప్రశ్న ప్రతి కుటుంబం తనను తాను అడగాలి.

## మన పిల్లలకు స్వదేశంలోనే భవిష్యత్తు లేదా?

ఇది అమెరికాను నిందించే ప్రశ్న కాదు. మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన సమయం.

మన పిల్లలు మంచి ప్రయోగశాల కోసం, మంచి విశ్వవిద్యాలయం కోసం, మంచి ఉద్యోగం కోసం ఎందుకు ఏడు సముద్రాలు దాటాలి? ప్రపంచస్థాయి విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు, సాంకేతిక సంస్థలు, అధిక నైపుణ్య ఉద్యోగాలు మన దేశంలోనే ఎందుకు పెరగకూడదు?.

ప్రభుత్వాలు విద్యపై ఖర్చు పెంచాలి. పరిశోధనకు ప్రోత్సాహం ఇవ్వాలి. విశ్వవిద్యాలయాలను ప్రపంచస్థాయికి తీసుకెళ్లాలి. యువతకు ఉద్యోగాలు సృష్టించాలి. అప్పుడు అమెరికా వెళ్లడం ఒక తప్పనిసరి మార్గం కాకుండా ఒక ఎంపిక మాత్రమే అవుతుంది.

## చివరిగా ఒక్క మాట

అమెరికా తలుపులు పూర్తిగా మూసుకోలేదు.. కానీ వాటి నిబంధనలు మారుతున్నాయి. ఇక ముందు ప్రతిభతోపాటు ఆర్థిక స్థోమత, నిబంధనల అవగాహన, సరైన సమయ నిర్ణయం కూడా అవసరమవుతాయి.

అమెరికా నిబంధనలు మన పిల్లల కలలను పరీక్షిస్తున్నాయి. కానీ అవి మనకు వేస్తున్న అసలు ప్రశ్న మరొకటి..

"మీ పిల్లల భవిష్యత్తును మీ దేశంలోనే మీరు నిర్మించగలరా?"

దీనికి సమాధానం అమెరికా చెప్పదు.

మనమే చెప్పుకోవాలి.



-శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9133947176

## నేటి భారతం

పిల్లలూ!
నన్ను చదువు చెప్పనివ్వండి !
నేను లంగను గాను బుంగను గాను
మీ కన్న
అజ్ఞానిని కాను అనామికుడను గాదు
బతుకంతా కఠిన 'పరీక్ష'లు
తట్టుకొని నిలబడ్డ జ్ఞాన పునీతుడను.

పిల్లలూ !
నేను చెప్పినట్లు వినండి !
మీ వయస్సు
నా అనుభవంలో పావు వంతు
ప్రార్థనకు
రోజు హాజరుకండి
క్రమశిక్షణలో నిటారుగా నిలబడండి
ఏకరూప దుస్తుల్లో వస్తూ
భిన్నత్వంలో ఏకత్వం
సిద్ధాంతాన్ని ప్రదర్శించండి.

నేనేమీ చెడిపోయే ముచ్చట్లు వల్లెవేస్తాలేనే
నిరూపణలు అక్కరలేని
జీవిత సత్యాలు చెబుతున్న
బూతు మాటలు మాట్లాడకండి
తార్కిక ప్రతిపాదనలను
స్వీకృతాలను దారి దీపాలుగా స్వీకరించండి
నన్ను అనుసరించండి
విజ్ఞాన అయస్కాంతమును .

నా వేషా భాషా నచ్చట్లేదా !
నా వ్యక్తిత్వం
భావాజాలం వేరుగానున్నదా !
ఉపాధ్యాయ వృత్తికి భంగం కలిగిస్తున్నానా !
చెప్పండి !
మీరు మారకున్నా
నేను మారడానికైనా సిద్ధంగా ఉన్నా !
స్థిర ప్రజ్ఞుడను.

తల్లిదండ్రులు పెద్దవారు చెప్పినట్లు
వినడానికి మీ ముళ్లేమి పోతుంది
మీ కొమ్ములేమి వంకర పోవు కదూ !
ఆ... జుట్టు ఈ... డ్రెస్సు
ఇలా ఉంటే ఎలా...!
వ్యసనాలకు
అనేక పర్యవసానాలు ఉంటాయి
రోజూ !
కొంచెం కొంచెం మారండి !
ఉపాధ్యాయునిగా
నాకేమీ గొంతెమ్మ కోరికలు లేవు
మిమ్మల్ని ఉత్తమంగా ఉన్నతీకరించడమే !

ఏ దేశమైనా...
జాతి నిర్మాణంలో భాగంగా
మంచి సమాజం కోసం
ఉత్తమ పౌరులను తయారు చేసుకోవాలని
స్పష్టమైన కలలు కంటుంది
పిల్లల నుండి ఆశించే ముఖ్య పరికల్పనలు
చదువు సంస్కారం .

పాలన వ్యవస్థ
ఇప్పుడు ....అన్నీ ఇస్తుంది
కట్టుకోవడానికి దుస్తులు
చదువుకోవడానికి పుస్తకాలు
తినడానికి వేడి వేడి ఆహారం...
ఇంకా.... ఎన్నో సదుపాయాలు
డిజిటల్ తర'గతుల' సందేశాలు
ఇంకా...ఎం కావాలి !

తల వంచి చదువండి
తలెత్తుకుని బ్రతుకవచ్చు

అపాత్ర దానం ...
అన్యథా అన్నట్లు చేయకండి
చెప్పేది వినరు
విన్నది చదువరు
చదివింది రాయరు
నా పై అధికారులకు
ఏమి చెబుతున్నావంటే నేనేమి చెప్పాలి !
నిన్ను పరిశీలించి పరీక్షించి
నన్ను ప్రశ్నిస్తున్నారు
బంగారం చక్కని ఆభరణం కావాలంట !

ఎప్పుడు అర్థమైతదో ....!
ఉత్తర్వుల 'తల'కాయలకు
గుర్రాన్ని నీళ్లు తాగించలేని ఉపాయాలు
ఉపాధ్యాయులది రుజు మార్గ నిర్దేశం
విద్యార్థుల వక్ర 'బుద్ధుల'
కథా కథనాల పరిస్థితులు
ఇప్పుడు !
ఉపాధ్యాయుడు బిలో ట్వంటీ పర్సంటేజ్
చార్జింగ్ ఉన్న జ్ఞాన (ఐ )ఫోన్ జీవచ్ఛవం
నిజాలు అంత తొందరగా జీర్ణం కావు !

దయచేసి వినండి !
నా సబ్జెక్టేదో నన్ను చెప్పుకోనివ్వండి
చెప్పింది
ఏ రోజుదీ ఆ రోజే
వ్రాసుకుని చదువుకుని నేర్చుకునిరండి
వర్ధిల్లాలి! వర్ధిల్లాలి!
గురు శిష్య బంధం వర్ధిల్లాలి !
(సెప్టెంబర్ 5
జాతీయ ఉపాధ్యాయ
దినోత్సవం
పురస్కరించుకొని....



-జిందం అశోక్
8978532225





నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

## స్నేహం

స్నేహం బాధలో ఉన్నప్పుడు
భుజంపై వాలి ఓదార్చే
సంతోషపు సీతాకోక చిలుక
కష్టాల్లో ఉన్నప్పుడు
సహాయపు నిచ్చనేసి ఓదార్పునిచ్చే ఇంకో అమ్మ ఒడి
రెక్కలు లేని ఒంటరి పక్షినప్పుడు
తోడినిచ్చి నీ వెంటే ఉండే నీడ
చేయ్యందించే మరో నాన్నా
కన్నీటి సముద్రంలో ఈతరాని చేపలా కొట్టుకుపోయేటప్పుడు
అడగక ముందే ఆనందపు పడవ అందించి
కాపాడే కనిపించే దైవం
నిరుత్సాహం నీ మనసులో మేలుకొనప్పుడల్లా
ఉత్సాహపు గాలితో దాన్ని నిద్రపుచ్చే మాను
జీవితంలో ముళ్ళ దారులు ఎదురైనప్పుడల్లా
పువ్వుల వర్షం కురిపించే మేఘం
మంచి స్నేహం ఎప్పటికీ వాడిపోని పువ్వు
ఆకాశంలోని అక్షర నక్షత్రంత్రాలను
జతకట్టినా వర్ణించలేని గొప్ప బంధం ఈ స్నేహం

- పి.భవ్య శ్రీ

## తెలుగు భాష తియ్యదనం

తెలుగు మాట్లాడుతే
చెరుకు రసం తాగినంత తియ్యగ
ఉంటది
మల్లెపువ్వుకు ఎంత పరిమళమో
తెలుగు భాషకు
అంత సౌందర్యం
కోయిల పాట చెవికి
ఎంత వినసొంపో
తెలుగు పలుకు మనసుకు అంత
ఓదార్పు
ఇతర భాషలు అందమైన
రంగుల పూలైతే
తెలుగు భాష మాత్రం
పరిమళం వెదజల్లే మల్లెపూవు
అమ్మ ఒడి ఎంత సౌఖ్యమో
తెలుగు భాష అంత సౌఖ్యం
తెలుగు మన మాట,
తెలుగు మన పాట
తెలుగు మన గుండె చప్పుడు
తెలుగు మన ఉనికి ఇప్పుడు
ఈ తియ్యని భాషను ప్రేమిద్దాం
రాబోయే తరాలకు అందిద్దాం

- కె.పూజిత

## క్రీడే జీవన గీతం

క్రీడ
కేవలం గెలుపు కోసం కాదు
జీవితాన్ని గెలవడం కోసం!
మైదానమే మనకు
క్రమశిక్షణ నేర్పే గురుకులం
పరుగు అడుగే
పట్టుదలకు తొలిమెట్టు
ఓటమి ఎదురైనా
కుంగిపోకు ఆటగాడా!
పడిన ప్రతి అడుగు
పైకి లేవడానికి పాఠమే!
చెమట చుక్కలతో
విజయ గాథలు రాయాలి
కృషి అనే ఆయుధంతో
కలలను సాకారం చేయాలి
జట్టుకోసం ఆడే మనసు
సమైక్యతను నేర్పుతుంది
ప్రత్యర్థిని గౌరవించే గుణం
సంస్కారాన్ని చాటుతుంది
మైదానంలో నేర్చుకున్న
స్ఫూర్తి, ధైర్యం, క్రమశిక్షణ
జీవితమంతా తోడుంటే
ప్రతి అడుగు విజయమే!
క్రీడాకారుడి విజయం
ఒక్కరి గెలుపు కాదు -
దేశం గర్వించే క్షణం!
క్రీడను ప్రోత్సహిద్దాం...
ఆరోగ్యవంతమైన
తరాన్నినిర్మిద్దాం!

- రెడ్డిపల్లి వేంకటేశం

## జంతర్ మంతర్ "పంతం !!

పలక పై బలపంతో శ్రీకారం చుట్టిన వాళ్లే
ఇపుడు తమ భవిష్యత్తు భంగం అవుతున్నపుడు
పార్లమెంటు సాక్షిగా ఉద్యమాలకు పిడికిలెత్తి
శ్రీకారం చుట్టారు దార్శనికంగా.
రాబోయే యువత కోసం "జంతర్ మంతర్ "ముందు
పంతంగా దోషాలు లేని దిక్సూచిగా అష్ట దిక్కులను
ఒకటి చేసి ప్రతిష్టించారు !.
పాలకులు తోవ తప్పినపుడు
లైట్ హౌస్ గా యువత ప్రాణాలను త్యాగం చేసి
కాంతిపథంగా కొత్త చరిత్ర కాలం పై రాసారు
వర్తమానం భవిషత్తులకు స్ఫూరిగా !.
రాబోయే మన పిల్లలందరు ఈ ఉద్యమ శ్రీకారాన్ని
అసలైన పాఠంగా గుర్తుంచుకొని అనుసరిస్తారు.
ఇక ముందు సింహాసనాల పై కూర్చునే
అధినాయకులూ ఈ పాఠం మననం చేసుకోవాల్సిందే
బహుపరాక్ ! బహుపరాక్ !.
కట్టడంగా అనామకంగా ఉన్న
ఆశ్చర్య జంతర్ మంతర్ ఉద్యమ స్ఫూర్తిగా
ఎప్పటికీ చారిత్రక జ్ఞాపకం!
రేపటి పుస్తకాల్లో పేజీలు పేజీలుగా
హఠంగా పుటం పెట్టిన పాఠం !

-కందాళై రాఘవాచార్య
8790593638

## కలల నెలవంకలు

లోకములో చీకటి వెలుగులు
అన్యోన్యమైన చిరజంట
చీకటి లేనిది వేలుగేది?
వెలుగు లేక చీకటి ఉనికేది?
చీకటి వెలుగులే దృశ్యము
దివ్యమైన బతుకుచిత్రము
అమ్మతానానికి
అమ్మలు అమ్మమ్మలు
ఆకలికి అన్నపూర్ణలు
అన్యాయానికి కాళీమాతలు
ధైర్యానికి దుర్గాదేవతలు
కన్నీళ్ల,కష్టాల అలల వంకలు
సుఖసంతోషాల కలలనెలవంకలు
దుఃఖానందాల ఆలవాలము
మన జీవితము
ఆడవాళ్లు లేక
అది అసంపూర్ణము ఔనా కాదా?
పువ్వులకు పూసే నవ్వులకు
నవనీత మనసులకు
సున్నిత భావాలకు
కరుణా శాంతులకు
ప్రేమానురాగాలకు
చిరునామాలు వనితలు
పుడమి లాంటి సహనము
పువ్వులాంటి
సోయగము నెలవులు
మిలమిల తారలు
జలజల ధారలు
అందాల జలపాతాలు
సిగ్గుల సితపారిజాతాలు
కవుల కవనాలు
రవుల కుంచె మౌనగానాలు
స్త్రీమూర్తులవే
కోమలాంగుల వన్నెచిన్నెలు
కాటుక చూపుల వెన్నెలకన్నులు
వాత్సల్యానికి
సారథులు ఆతివలు
వంశాన్ని మోసే
వారధులు మగువలు.
దేశములో భాగము మహిళలు
అవనిలో ఆకాశములో
సగము మమతల ఇంతులే
కుటుంబంలో కాంతలదే
పైచేయైన ప్రపంచములో
మున్ముందు వినిపించాలి
చట్టసభల్లో
పడతుల గొంతు
ముప్పై మూడుశాతము.

-రమేశ్ నల్లగొండ
8309452179


## రుజువు

రుజువైంది
బలవంతమైన సర్పం
చలిచీమల చేత జిక్కి
చావదె సుమతీ
అనే బద్దెన పద్యం నిజమేనని
మరో సారి రుజువైంది.
ఎవరి జీవితమైనా ఒకటే
ఎవరి ప్రాణమైనా ఒకటే
అది పిల్లలదైనా పెద్దలదైనా
ఎవరికైనా కలలు నిజమైతే
విలాసం
కలలు కల్లలైతే విలాపం.
అన్యాయం ఎవరికైనా ఒకటే
బాధ ఎవరికైనా ఒకటే
రెండూ చీకటి సంద్రంలో
నెట్టేసేవే
అన్యాయం జరిగితే
చీమలేం కర్మ
బొద్దింకలు కూడా ఎదురు
తిరుగుతాయి
ఎప్పుడైనా ప్రశ్నించినోడికే ఫలం
ఎదురుతిరిగినోడిదే రాజ్యం

- ఎన్.నరేశ్ చారి

# మానవత్వాన్ని ప్రబోధించేలా 'కోగంటి' భావ ప్రకటన!

పుస్తక సమీక్ష




ప్రతులకు: ఉషారాణి కోగంటి, మధుపార్క్ రైడ్స్-ఎ-బ్లాక్, ప్లాట్ నెం.31/3, హసీంనగర్, లంగర్‌హౌస్ గోల్కొండ, హైదరాబాద్-500031 సెల్: 8179611745

వివిధ ప్రక్రియల్లో తమ సాహిత్య సృజనను చాటుకుంటున్న కవయిత్రి డా॥ ఉషారాణి కోగంటి గారు **"ఉషోదయ సాహితీ కిరణాలు"** పేరుతో ఓ కవితా సంపుటిని వెలువరించారు. వృత్తిరీత్యా కేంద్రీయ విద్యాలయాల్లో అనేక బాధ్యతలు నిర్వర్తించి.. కేంద్రీయ విద్యాలయ సంగఠన్ రీజినల్ ఆఫీస్ ఐఐటి చెన్నైలో అసిస్టెంట్ కమీషనర్‌గా సేవలందించి.. ఉద్యోగ విరమణ చేసిన ఆమె, ప్రవృతి రీత్యా సాహిత్య రంగాన్ని ఎంపిక చేసుకోవడం ముదావహం.. ప్రతి మనిషి తన జీవితంలో స్ఫూర్తి దాతగా, చైతన్యమూర్తిగా భాసిల్లాలని భావించే ఉషారాణిగారు తమ కవిత్వం నిండా మానవీయ విలువలకు పెద్దపీట వేస్తూ.. జీవన సత్యాలకు ఈ పుస్తకంలో చోటు కల్పించారు. మతం కన్నా మానవత్వం గొప్ప అని ఆకాంక్షించే ఆమె... రోటరీ, సాహితీసేవలో తమ విశ్రాంత జీవితాన్ని గడపడం అభినందనీయం.. గౌతమ బుద్ధ ఫౌండేషన్‌ను స్థాపించి.. సామాజిక సేవలో తరిస్తున్న డా॥ ఉషారాణి కోగంటి గారు ప్రస్తుతం వెలువరించిన **"ఉషోదయ సాహితీ కిరణాలు"** కవితా సంపుటిలో.. 87 కవితలు కొలువుదీరాయి.. ఇవి సరళంగా ఉన్నప్పటికీ.. విభిన్న భావాల సమాహారంగా రూపుదిద్దుకున్నాయి. ఇందలి కవితలు మానవత్వాన్ని ప్రబోధిస్తాయి. మన దేశ గొప్పదనాన్ని మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాన్ని చాటి చెబుతాయి. అంతేగాక ఈ సంపుటిలోని కవితలు మన దేశం విశ్వానికి మార్గదర్శిగా నిలిచిన సంగతిని గుర్తు చేస్తాయి. దేశాభ్యుదయమే మన ధ్యేయమని తెలియజెబుతాయి. భారతీయ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ప్రముఖులను ప్రస్తుతిస్తూ రాసిన కవితలు కానవస్తాయి. ఇంకా భారతరత్నం స్వామి వివేకానంద గొప్పదనాన్ని చాటి చెబుతూ రాసిన గేయం... భారత రాజ్యాంగ శిల్పి అంబేద్కర్ జీవన రేఖలు ప్రతిఫలింపజేసే కవితలున్నాయి. స్ఫూర్తిదాత అబ్దుల్ కలాం వ్యక్తిత్వం.. మేధో సంపత్తిని తెలియజేసే రచనలు, అమరవీరుడు- అల్లూరి సీతారామా రాజు పరాక్రమం, విప్లవ కవి చెరబండరాజు విప్లవోద్యమ రచనలు ఈ సంపుటిలో మనకు దర్శనమిస్తాయి. ఓటుశక్తి ఆవశ్యకతను.. కుసుమ ధర్మన్న దళిత ఉద్యమ కవనాలను.. గుర్తు చేసే విధంగా కవయిత్రి ఉషారాణిగారు ఈ గ్రంథంలో పొందుపరిచారు. ఇవే కాక.. భారతజాతి ముద్దు బిడ్డ కెప్టెన్ బాత్ర, సమతామూర్తి శ్రీ రామానుజాచార్య, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ, ఉద్యమశీలి డా॥ దాశరథి ప్రజ్ఞా పాటవాలను ఆవిష్కరిస్తూ రాసిన రచనలు మనకు స్ఫూర్తిని నింపేలా ఉన్నాయి. సాహిత్యంలో మేటి సృజనకారులు, క్రాంతికారుడు శ్రీశ్రీ గురించి దేవులపల్లి కృష్ణశాస్త్రి పొట్లూరి భావుకత గురించి, నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు సేవలను.. ప్రతిభను ప్రశంసిస్తూ రాసిన రచనలు బాగున్నాయి..

**"అమ్మా! నీ త్యాగం వృధా కాదమ్మ"** కవితలో కవయిత్రి కోగంటి ఉషారాణిగారు... తమ అమ్మతో ఉన్న అనుబంధాన్ని ఆవిష్కరించారు. ప్రణాళికాబద్ధ నిర్ణయ ప్రతిభామణి.. విద్యా వివేక వికసిత మకుటీమణి.. అవిశ్రాంత శ్రమైక సుసౌందర్యమణి, నిర్భయ హేతుబద్ధ ఆశయ సాధనామణి అని అంటూ అమ్మను కొనియాడారు. అమ్మంటే మధురామృత భాండమ్మురా.. అమ్మంటే ఏ నాటికీ తరగని భాగ్యమ్ము రా.. అమ్మ మాట పాటిస్తే బంగారు బావుటవునురా! అంటూ కొనసాగించిన పంక్తులు అమ్మ యొక్క ఔన్నత్యాన్ని చాటే విధంగా ఉన్నాయి. **"మాతృత్వపు సిరిజల్లు-ఆనందాల హరివిల్లు"** కవితలోనూ మాతృమూర్తి పట్ల శ్రద్ధాభక్తులను ప్రదర్శించారు. అమ్మను సన్మార్గమే ధ్యేయమై మన జీవన నావను నడిపించే చుక్కానిగా.. అభేద్యమైన మహాశక్తిగా, అసాధ్యాన్ని సుసాధ్యం చేసే ప్రచండ మనో నిగ్రహ ధీశక్తిగా అభివర్ణించారు.

సృష్టికి ప్రతి సృష్టి చేసే అపురూపం అమ్మతనమనీ..అనురాగపు లాలన, పాలన మాతృత్వపు మాధుర్యమంటూ 'ప్రపంచమంత విశాలం అమ్మ' కవితలో అమ్మ యొక్క ప్రాశస్త్యాన్ని అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

కవయిత్రి ఉషారాణిగారు నాన్నపై తమ గౌరవాన్ని చాటుకుంటూ.. **"నాన్నే నా హీరో-నాకదర్శం"** అంటూ ఓ కవితను రాశారు. నాన్న కుటుంబ బాధ్యతలను నిర్వహించే సమర్థుడనీ.. నాన్న ఆత్మీయుడై ఆదర్శంగా నిలిచే దార్శనికుడని పేర్కొన్నారు.

నాటి ఉమ్మడి కుటుంబంలో సభ్యుల మధ్య ఆత్మీయ బంధాలు నూరేళ్ళ విలసిల్లేవనీ.. సమాజ శ్రేయస్సుకై మర్యాద మన్ననలతో హార్దిక బంధాలు కళకళలాడేవని గుర్తు చేసుకుంటూ **"నేటి సమాజంలో పైశాచి కత్వాన్ని"** ఎత్తి చూపుతూ ఓ కవితను రాశారు.

**"డబ్బు కాంక్షే-పెద్ద జబ్బు"** అంటూ విడమరిచి చెబుతూ రాసిన కవితలో డబ్బు కాంక్షతో ఒనగూరే అనర్థాలను ఏకరువు పెట్టారు. మన జీవితానికి మనమే స్ఫూర్తి దాతగా నిలుద్దామంటూ పిలుపునిస్తూ **"జీవితం ఒక నాటకం"** కవితను తీర్చిదిద్దారు.

సత్యసాయి బాబా, గుఱ్ఱం జాషువా, వివేకానందుడు, ఎమ్.ఎస్.రామారావు, గౌతమ్‌బుద్ధుడు తదితరులపై కవయిత్రి రాసిన రచనలు ప్రేరణ దాయకంగా ఉన్నాయి.

**"మానవత్వమే-స్నేహతత్వమంటూ'** రాసిన కవితలో ప్రతిఫలాన్ని ఆశించక, భిన్నత్వంలో ఏకత్వం చూపే వ్యక్తుల మనసుల్లో కలిగే మధుర భావనలో మానవత్వమే- స్నేహతత్వమని తేల్చి చెప్పారు.

హైదరాబాద్ నగరం ఘన చరిత్రను చాటి చెబుతూ రాసిన కవితలో.. ఘన చరిత్ర గల నగరం మన హైదరాబాద్-విశ్వ నగరంగా విలసిల్లేలా మార్చుదామంటూ పిలుపునిచ్చారు. **"ఆడవాళ్ళు అబలలు కాదండి"** కవితలో ఆడవాళ్లపై జరుగుతున్న అరాచకాలను అక్షరీకరిస్తూ ఆడపిల్లల జీవితం బంగారు భవితతో విరాజిల్లాలని కాంక్షించారు.

ఇలా కవయిత్రి ఉషారాణిగారు ప్రతి మనిషి జీవితంలో స్ఫూర్తిదాతగా, చైతన్య మూర్తిగా వెలుగొందాలని కాంక్షిస్తూ తమ భావాలను ప్రకటించారు. అయితే కవయిత్రి తమ ఆలోచనలను కవిత్వ రూపంలో ఆవిష్కరించే క్రమంలో... వచనానికి పెద్ద పీట వేశారు. ఫలితంగా కవిత్వాంశ కొరవడింది. కవిత్వాన్ని కవిత్వంలా రాయాలన్న సంగతి ఉషారాణి గారికి తెలియనిది కాదు. మున్ముందు గాఢమైన కవిత్వాన్ని ఆశిద్దాం.. కవితలు.. "మినీ వ్యాసాలు"గా రూపుదిద్దుకోకుండా జాగ్రత్త పడగలరని విశ్వసిద్దాం... కవిత్వ కనీస ప్రమాణాలు పాటించాలని కోరుకుందాం.. ఈ దిశలో ఆమె అడుగులు వేయాలని ఆకాంక్షిద్దాం..



**-దాస్యంసేనాధిపతి**
సెల్:9440525544

## మాట మర్యాద

అనుమానానికి ప్రశ్నలు ఎక్కువ
అభిమానానికి ప్రేమలు అధికం
కొన్ని సార్లు మాటల మాయ కన్న..
మౌనమే అధికంగా అర్థం అవుతుంది !.
అర్థం చేసుకుంటే మనశ్శాంతి
ఆవేశపడితే పొంగుతుంది బిపీ
తలొగ్గడం అంటే ఓటమే అయితే..
ఎక్కువ జంటలు విచ్ఛిన్నమయ్యేవే !.
మర్యాద తప్పితే కుసంస్కార వాతలు
మాట మీద నిలబడితే కష్టాల మోతలు
అద్దం చూపేది బాహ్య అందం మాత్రమే
ప్రవర్తన చూపేది అంతర్ సౌందర్యం !.
స్వేచ్ఛ అంటే తెగిన గాలి పటం కాదు
హద్దు అదుపుల్లో ఆనందంగా ఎగరడం
నీతికి నిలబడితే కష్టనష్టాల గోడలు
అవినీతికి పాల్పడితే ఛీత్కార గొడవలు !.
సూది ఒంటరిగా దూరితే గాయం
సూదితో దారం కలిస్తే ఐక్య బంధాలు
మనిషి మనసు దారి తప్పితే గాయాలు
మనిషితో సత్కర్మలు కలిస్తే జన జేజేలు !.
నిన్నటి నీ ప్రవర్తన నేడు నీకే నచ్చకపోతే..
లోకులకు అదో చర్చనీయాంశం అవుతుంది
నేడు నేను వేసే ప్రతి ఆలోచనాత్మక అడుగు
రేపటి ప్రపంచానికి
వెలుగుల దారి కావాలి !.
కంటికి కనబడేవన్నీ నిజాలు కావు..
విన్నవన్నీ నమ్మడానికి వీలు ఉండదు
నడిబజారు నరులంతా కోత కూతల రోగులే
నమ్మకం ఉన్న చోట
అనుమానం బతకదు !



**-మధుపాళీ**
9949700037

## లలిత కళల కోర్సులకు సాంకేతికతను జోడించాలి

త్రిపుర గవర్నర్ ఎస్. ఇంద్రసేనారెడ్డి



ఆంధ్ర అసోసియేషన్ పూణె సలహాదారు టి.వి. శ్రీనివాస్‌కు సంస్కృతి పురస్కారాన్ని అందజేస్తున్న డా॥కె.వి.రమణాచారి మండలి బుద్ధప్రసాద్, త్రిపుర గవర్నర్ ఎస్. ఇంద్రసేనారెడ్డి, వి.సి. నిత్యానందరావు. తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా లలిత కళల కోర్సులకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పద్ధతులను జోడించి బోధన కొనసాగించేలా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కృషి చేయాలని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి సూచించారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో నాంపల్లి ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఆంధ్ర అసోసియేషన్ పూణె సలహాదారు టి.వి. శ్రీనివాస్‌కు మండలి వెంకటకృష్ణారావు సంస్కృత పురస్కారం ప్రదానోత్సవం శనివారం జరిగింది. పురస్కారం కింద రూ. 25 వేల నగదుతో పాటు జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ప్రసంగిస్తూ మాతృభాష విస్తరణకు కృత్రిమ మేధస్సులోనూ తెలుగు వాడుక భాష వినియోగం జరగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. లోకజ్ఞానాన్ని అందించేలా సాంకేతిక విద్యా పాఠ్యప్రణాళికలను తెలుగు విశ్వవిద్యాలయం రూపొందించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి ప్రసంగిస్తూ ప్రవాసాంధ్రులకు సంస్కృతి పురస్కారంతో సత్కరించడం అభినందనీయమన్నారు. అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, తెలుగు వర్సిటీ వీసీ నిత్యానందరావు, రిజిస్ట్రార్ కె. హనుమంతరావు, పద్మప్రియ, డాక్టర్ విజయపాల్ పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1862వ రోజు **'చూపులు'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'చూపులు'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.
-సంపాదకులు

*మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం*
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:



## ఎన్నెన్నో సూచనలు

చూపుల్లో ఎన్నెన్నో
సూచనలు
దాగి ఉంటాయి.
మనసు
మౌన గీతం పాడుతుంటే
చూపులే సంగీతం వాయించేది.
మనసు
అలక పాన్పు ఎక్కినప్పుడు
పలకరింపులకు
సమాధానం చెప్పేది చూపులే.
కోపం నిండిన మనసుకు
శత్రువు పైన యుద్ధానికి సిద్ధం
చేసేది చూపులు
చుర కత్తులకే.
మనసులోని మర్మం
మనిషిలోని మనో వేదన
చూపుల్లో కనిపిస్తాయి ఆ చూచనలు
మూగ మనసు
ముచ్చటించేది చూపులతోనే.
మమతానురాగాలు
మనసుల్లో ఉంటే
దయాగుణంతో
బంధాలు అనుబంధాలను
ఒక్కటి చేసేది
చూపుల దీపాలే.
శత్రువులను మిత్రువులను
ప్రేమను కోపతాపాలు
బతుకు బాటలకు
మంచి చెడుకు
చూసే చూపులే ఆధారం.
చూపుల్లో దాగి ఉన్న సూచనలను
నవ్వులో దాగి ఉన్న రకాలను
తెలుసుకున్నవాళ్ళే మేధావులు.
ఆలోచనలను పసి గట్టలేం
చూపుల్లో సూచనలను
కొంతవరకు కనిపెట్టొచ్చు
అంచనా వేయొచ్చు
మనిషి బుద్ధిని.

**-పొన్నాల ధనమ్మ**

## మనవి

తెలుపు వర్ణపు
చీర ధరించిన ఆమె..
మనసు ఎలాంటిదో తెలుపుతోంది!.
చేతులు నలుపుకొంటూ
నిరీక్షిస్తోంది ఆమె
నలుపు ముంగురులను
సవరించుకొంటూ.
చక్కనమ్మ
చిక్కినా అందమే..
నా చూపుల గేలానికి
ఆమె చూపులు ఎప్పుడు చిక్కునో ..?!.
ఆమె అందమైన వాలుచూపులు
నాపై వాలుతున్నాయి
సీతాకోక చిలుకల్లా.
నా రేఖతో లేఖను
చదివిన ఆమె
ఎలా స్పందిస్తుందో..?!
నాభాగ్యరేఖ ఎలాగున్నదో..?!
ఆమె జ్వలనం
తెలిసిన విషయమే కదా!
ఈ వేళ ఎలాగైనా
మేళనం జరగాల్సిందే.
నా మనవిని వినమని
"ఇక నీ ఆశలూ
ఆశయాలూ మనవి" అని
మనవి చేస్తాను
చివరికి ఆమె మేలు దొరికి
అంతా మేలు
జరుగుతుందని ఆశిస్తున్నా!

**-చంద్రకళ దీకొండ**

## ఇక్కట్లు

ఆ చూపులు
అనేక ఖనిజాల గనులు,
చొచ్చుకుపోయే
పదునైన బాణాలు,
వీరుణ్ణి పిరికిపందగా
సన్యాసిని సంసారిగా
సంసారిని సన్యాసిగా
చేయగల మంత్రదండాలు.
సరైన గురువు చూపులు
శిష్యుని మౌన భాషలను
సరిదిద్దగల సవరణ సూచికలు
కొన్ని చూపులతో
వివాహ బంధాల
జీవితాలు ముడి పడతాయి
కొన్ని చూపులు
పచ్చని కాపురంలో
భగ్గుమనిపించగల
నిప్పు కణాలు.
పరమాత్మ కటాక్ష చూపులే
మనల్ని సర్వదా రక్షించే
కరుణామయ చూపుల
మూగజీవుల ఆక్రందనలే
హింసాత్మక ప్రవృత్తులను
ఎత్తిచూపే చూపులే చూపులు
దాపులేని మాపులు
నీటనా ముంచగలవు
పాలలోనూ ముంచగలవు.
చూపుల ముచ్చట్లే ముచ్చట్లు
మనందరికీ తొలగిస్తాయి ఇక్కట్లు.

**-రాజప్ప**

## శూర్పణఖ చూపులు చూడలేం బాబూ!

శూర్పణఖ చూపులు
చూడలేం బాబూ!
కళ్ళు రెండైతే
చూపులు వందల్లో అపారం!
కనిపిస్తాయి
కొన్ని చూపులు వింతగా!
ప్రేమ చూపుతో
మనసు పారేసుకుంటారు!
కోపపు చూపు ఐతే
దూరంగా పరిగెడతారు!
ఆఫీసులో బాస్ చూసేది
డేగ చూపు!
జీతం పెంచమని అడిగితే
దొంగ చూపు!
పెళ్లిచూపుల్లో వధువుది
సిగ్గు చూపు!
కట్నం అడిగే వరుడుది
కక్కుర్తి చూపు!
అందగాడిపై అతివ విసిరేది
వలపు చూపు!
పరీక్ష హాల్లో మిత్రుడిది
'సహాయక చూపు!
వీక్షకుడు తిరుగుతుంటే
మనది బిత్తర చూపు!
షాపింగ్ మాల్ లో
ఆలిది ఆశల చూపు!
బిల్లు చూసిన భర్తది
అచేతన చూపు!
పక్కింటి వాళ్ళది
ఎప్పుడూ అసూయ చూపు!
వంటింట్లో ఏ వంటో చూసేది
ఆత్రుత చూపు!
తలుపు వెనుక నక్కి చూసేది
గుంటనక్క చూపు!
బస్సులో సీటు కోసం వెతికితే
వేగు చూపు!
డైట్ చేసే వాడిది
బిర్యానీ పై నోరూరే చూపు!
భోజనం అయ్యాక
స్వీట్ కోసం ఎదురుచూపు!
నిలువుటద్దం ముందు
నిలబడితే హీరో చూపు!
ట్రాఫిక్ పోలీస్ కు చిక్కితే
బెదురుచూపు!
చలానా కట్టమంటే
డబ్బు లేక దీనపు చూపు!
చూపులు ఎన్ని ఉన్నాలోకంలో
చరవాణిని వదలని చూపైతే
ఆగని చూపు!!.

**-కోలా సత్యనారాయణ**

## ఎన్నెన్నో!

సూర్యుని చురుకు కిరణాల
చూపులతో మేలుకొలుపు
ఎంచక్కా కమలాలు
కనులు విప్పార్చి
కళకళలతో కేరింతలు
మొహం ముడుచుకుని
కలువలు కన్నీటితో
వేస్తాయి ముసుగు.
అమ్మ చూపుల చురచురలతో
పడకనుంచి గంతులు
ధన్ మంటూ
మంచంపై నుంచి దూకి.
నాన్నింకా నిద్ర గురకలో
పిల్లలంతా ఘర్ ఘర్ తిరంగాతో
కేకలు అరుపులతో
తూలే నిద్రతో
వాడిబాణాల చూపుల
నాన్న అరుపులతో
ఇల్లంతా ధమధమ మోతలు.
టైంకి రాని ఉద్యోగులపై
అధికారి చూపులు
చేస్తాయి భస్మం
మెమో వస్తుందనే భయం!
కొరివి కారం చూపులతో
నేటి కోడళ్లు-
వృద్ధుల పై పటపట దంతాలు
అది తట్టుకోలేక
నీరసంగా వాలిన
కన్నీటి నేలచూపులు.
క్రూరుని శాడిస్టు చూపులకు

## తలుపులు

ప్రాణి దేహానికి
తలుపులే చూపులు.
ఏం చూడాలన్నా
ఎక్కడేముందో తెలవాలన్నా
మంచీచెడుల భేదం ఎరగాలన్నా
అందం వికారాలను విడదీయాలన్నా
ఆ తలుపులు తెరిస్తేనే తెలిసేది
ఆ చూపు ఉంటేనే తేడా
గమనించేది.
ఓరచూపు
కొంటెచూపు
చిలిపిగా కవ్వించే చూపు
కోపం తెలిపే చూపు
రౌద్రంగా భయపెట్టే చూపు
భయంతో వణికే చూపు.
ఆర్ద్రతకు అర్థం చెప్పేవి
జాలి కరుణ చూపేవి
ఆశ్చర్యం ఆనందం వ్యక్తం చేసేవి
వ్యంగ్యం, నిరసన తెలిపేవి
ప్రేమా ఆప్యాయతలు కురిపించేవి
భయాన్ని బాధను వెల్లడించేవి
కఠినంగా కరుకుగా చూసేవి
ఇలా ఎన్నో అనుభవాలనిచ్చేవి
ఆ తలుపులే.
భాష ఏదైనా భావాన్ని అందించే
ఆ తలుపులే మూసుకుపోతే
ఏ జీవైనా ప్రాణమున్న జీవచ్ఛవమే.

**-గుఱ్రాల వేంకటేశ్వర్లు**

## దృష్టే అదృష్టం

ఒకసారి నా గదిలో ఉన్న
దర్పణంలోకి చూస్తున్నా
దానిముందు నిలబడి.
దొరికాయి బోలెడు చూపులు
ఒక చూపు
చురుక్కుమనిపించింది
మరొకటి
తళుక్కుమనిపించింది
ఇంకొకటి కట్టెతో కొట్టినట్టు
ఆ పై మరొకటి
అందాలు ఆరబోసినట్లు
కనుబొమ్మలు ఎగరేసి
క్వశ్చన్ మార్క్ మరొకటి
కళ్ళు బొంగరంలా తిప్పుతూ
ఏదో చెప్పమంటూ
మరోజంట.
అద్దం ముందున్న నేను
వెనుతిరిగి చూశాను.
ముకురంలో మురిపించిన
చూపులన్నీ నా నెచ్చెలివే.
"నా జన్మదిన శుభవేళ
నాతో కలిసి మురిసి
సరదాల సరస్సులో
శిరస్సులు ముంచి తేల్చాలని
వచ్చారన్న" నామాటకు
అమ్మ చూపులు
అమృతాభిషేకమే.

**-డా.సి. వసుంధర**

జడిసే హరిణిబాల
ఎల్ నినో చూపులతో
విలవిల ప్రపంచం
దిష్టి చూపులని
అమ్మలక్కల మూతివిరుపు.
ఉత్తిష్ఠరామా అన్న పిలుపుతో
చిర్నవ్వుల రాముని
చల్లని చూపులు శ్రీరామ రక్ష!.

**-ఎ.రాజ్యశ్రీ**

## తరాజు లేని తూకం

పానం సొంప్తలేదు
ఒళ్ళంత బరువు బరువు
పెయ్యంత కుంపు కుంపు
"యాష్ట అలిష్ట" అనకుండ
అంగవడి పనిచేత్తెనె మంచిగ
పని లేకపోతే పాడే .
పొద్దటిది పొట్టకు
మాపటిది బట్టకు
అన్నోల్లకు ఏడ పొద్దూక్తది
ఏడ తెల్లార్తది
బతుకంతా బండ మోతే
శెమకు దక్కేది బుక్కెడు బువ్వే.
అండ్లవోంగ
ఎండకు అగ్గి భగ్గుమని అగిర్తేసుడు
వానకు గుబులు గుబులు
చలికి సవసవ
పానం సొడ సొడలు పోవుడు
జీవం తడతడమనుడు.
జీవనం భూచక్రమే
శారీరకమైనా మానసికమైనా
శ్రమకు ప్రతిఫలం
వేతనం మాత్రమే.
శ్రమే శ్రామిక నాగరికత
శ్రమే ఆహార తయారీ రసాయన ప్రక్రియ
శ్రమయే సకలార్థకరం.
చెమట చుక్కల బరువును
తెల్లబడ్డ బొక్కల రంగును
నరాల తీగల మీద నడిచే శ్రమను
నిద్ర మింగిన కళ్ల చీకటిని
ఎత్తుగట్టిన తరాజు లేదు
తూకం వేసే యంత్రం లేదు



**-బొల్లం బాలకృష్ణ,**
99989735216

## విచక్షణ!

అందరి మాట వినే వాడు
ఎవ్వరి మాటా వినని వాడు
అన్ని సమయాల్లో అందరికీ
అందుబాటులో ఉండేవాడు
సమయానికి అసలే దొరకనోడు
ఎన్ని జన్మలెత్తినా బాగుపడడు.
అందుకే, జీవితం అంధకారంలో
మునిగిపోకుండా ఉండాలంటే
మనం "విచక్షణ" నేర్చుకోవాలి!



**- డా॥ డి.రాజేశ్**
9440460490

## ఘనంగా పద్మశాలి ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం, నూలు పౌర్ణమి వేడుకలు



**పురస్కార గ్రహీతలతో అతిథులు.**

హైదరాబాద్, సెప్టెంబర్ 2:మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనిలో గల శివమార్కండేయ దేవా ఃలయంలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన నూలు పౌర్ణమి, టీపోపా ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆగష్టు 28 న రాఖీ పౌర్ణమి పం డుగను పురస్కరించుకుని శివమార్కం డేయ దేవాలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (టీపోపా) జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్, ఎప్ సెట్, నీట్ లలో ప్రతిభ కనబరచిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భం గా టీపోపా జిల్లా అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యారంగంలో ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులకు ప్రతి సంవత్సరం పద్మశాలి ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. పద్మశాలి విద్యార్థులు విద్యారంగంలో అత్యంత ప్రతిభ కనబరచడంతో పాటు అన్ని రంగాల్లో పోటీపడాలన్నారు. టీపోపా ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో అత్యున్నత మార్కులు సాధించిన వారికి పద్మశాలి ప్రతిభా పురస్కారాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 19 వ వార్డు కార్పోరేటర్ తిరుమల రోజా వేంకటేశ్, టీపోపా జిల్లా ప్రధాన కార్యదర్శి బోగం నాగరాజు, కార్యదర్శి దాసు పద్మనాభుడు,జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శులు సూర ప్రతాప్, దాసు వేంకటేశ్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు పల్లాటి బాలరాజు, ప్రధాన కార్యదర్శులు కోడి రాజశేఖర్, కడదాసు సత్యనారాయణ, జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు కొంగరి వేంకటేశ్, జిల్లా పద్మశాలి మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి బోగం రేణుక, మచ్చ వాణి, సంఘం నాయకులు కొంగరి సత్యనారాయణ, బాలకిష్టప్ప, పల్లాటి తారకం, బోగం శివాజీ, జన్ను వేంకటేశ్, కోడి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోసిన జమలాపురం కేశవరావు



నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతుకుతున్న వారి స్వేచ్ఛకోసం, తమ జీవితాన్ని త్యజించిన వారిలో 'సర్దార్ జమలాపురం కేశవరావు' ముందు వరుసలో నిలుస్తారు..

కట్టెదుట జరుగుతున్న అన్యాయాలకు చూస్తూ, సహిస్తూ ఉండలేక ప్రజల్లో ధైర్య సాహసాలను నూరి పోయడమే ఏకైక లక్ష్యంగా జీవితాంతం మందుకు సాగారు. హైదరాబాద్ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీకి జీవం పోసి, ప్రజా శ్రేయస్సు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిబద్ధత కలిగిన నేత, త్యాగశీలి సర్దార్ జమలాపురం కేశవరావు. సత్యాగ్రహిగా, క్విట్ ఇండియా ఉద్యమ కార్యకర్తగా, ఆంధ్ర మహాసభ నిర్వాహకుడిగా, గ్రంథాలయోద్యమ నిర్మాతగా, ఆది వాసీ, దళిత జనోద్ధారకుడిగా, పత్రిక స్థాపకుడిగా ఇలా కొన్ని ఎన్నో కార్యకలాపాలు చేపట్టి హైదరాబాద్ రాజ్య ప్రజల్లో చైతన్యాన్ని, ధైర్యాన్ని నింపిన మహోన్నతుడు కేశవరావు. అందుకే ఆయన్ను అందరూ తెలంగాణ 'సర్దార్'గా పిలుచుకుంటారు. తెలంగాణ కేసరిగా, 'దక్కన్ సర్దార్'గా బిరుదు లందుకున్న జమలాపురం కేశవరావు తనదైన శైలిలో ఉద్యమాలు నడిపి కాంగ్రెస్‌కు, తెలుగు వారి ముఖ్యంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోశారు.

దక్కన్ సర్దార్‌గా, ఉక్కు మనిషిగా ప్రజలు పిలుచుకునే కేశవరావు నిజాం సంస్థానంలో తూర్పు భాగాన ఉన్న ఖమ్మం (నాటి వరంగల్ జిల్లా)లోని ఎర్రుపాలెంలో 1908, సెప్టెంబర్ 3న జమలా పురం వెంకట రామా రావు, వెంకట నరసమ్మలకు తొలి సంతానంగా జన్మించారు. సంపన్న జమీం దారీ వంశంలో పుట్టినా, నాటి దేశ రాజకీయాలు అతనిని తీవ్రంగా కలవర పరచాయి. ఎర్రుపాలెం లో ప్రాథమిక విద్య అనంతరం, హైదరా బాదులోని నిజాం కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. వందేమాతరం గీతాలాపనను నిషేధించ నందుకు నిరసనగా, కళాశాల విద్యార్థులను కూడగట్టి, నిరసనోద్యమంలో కాలూనారు. గీతాన్ని ఆలాపించ నివ్వకపోతే తరగతులకు హాజరు కాబోమని హెచ్చరించారు. దీంతో చివరకు నిజాం పాలకవర్గం నిషేధాన్ని ఎత్తివేయక తప్పలేదు. ఈఘటన తర్వాత కేశవరావు ఆలోచనా పరిధి మరింత విస్తృతం అయింది. నిజాం పాలనలో కొనసాగుతున్న వెట్టి చాకిరితో అష్టకష్టాలకు గురవుతున్న ప్రజలను చూసిన కేశవరావు చలించి పోయారు. ప్రజలను విముక్తం చేయడానికి తెలంగాణ జిల్లాల్లో... ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కేశవరావు కాలినడకన విస్తృతంగా పర్యటించారు. ఆ క్రమంలోనే భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల, గాంధీ సిద్ధాంతాల పట్ల కేశవరావు ఆకర్షితుడయ్యారు.

1923లో రాజమండ్రిలో మొదటిసారి మహాత్మా గాంధీ ఉపన్యాసాన్ని విన్న కేశవరావు, 1930లో విజయవాడలో జరిగిన సభలో గాంధీ పరిచయంతో మరింత ఉత్తేజితుడైనారు. ఆంధ్రపితామహుడుగా మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన గ్రంథాలయ ఉద్యమంను తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రచారం గావించారు. వయోజన విద్యకై రాత్రి పాఠశాలలు నడపడంలో కేశవరావు కృషి చేశారు. అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని నింపడానికి ప్రత్యేక శ్రద్ధను కనపరిచేవారు. 1938లో దీపావళి సందర్భంగా ఆవిర్భవించిన 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' స్థాపనలో కేశవరావు కీలకపాత్ర వహించి, దానికి మొదటి అధ్యక్షుడ య్యారు. 1938 సెప్టెంబర్ 24 మధ్యాహ్నం మధిరలో గోవిందరావు నానక్, జనార్ధనరావు దేశాయ్, రావి నారాయణరెడ్డిలతో కలిసి సత్యాగ్రహ దీక్షకు కేశవరావు సిద్ధమయ్యాడు. ఎట్టి పరిస్థితుల్లో సర్దార్‌ను దీక్ష చేయనివ్వొద్దని నిజాం ప్రభుత్వం అనుమతి నివ్వలేదు. మధిరలో అడుగ డుగునా పోలీసులను మోహరించింది. అయినా భారీ సంఖ్యలో ప్రజలు దీక్ష వేదిక దగ్గరకు చేరుకున్నారు. అప్పుడే ఎవరూ ఊహించని విధంగా రైతు వేషంలో దీక్ష వేదిక దగ్గరకు వచ్చాడు కేశవరావు. వెంటనే మహాత్మా గాంధీకి జై, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ జై అని దిక్కులు పెక్కటిల్లేలా నినాదించారు.

అరెస్టు చేసి నిషేధాన్ని ఉల్లఘించి సత్యాగ్రహ దీక్ష చేశారంటూ కేశవరావుకు 18 నెలలు జైలు శిక్ష విధించారు. వరంగల్ జైలులో ఎనిమిది నెలల శిక్షను అనుభవించిన తర్వాత కేశవరావుతో సహా రాజకీయ ఖైదీలందరినీ నిజామాబాద్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా అదే పోరాట పంథాను కేశవ రావు కొన సాగించారు. అంటరానితనం నిర్మూలించేందుకు, ఆది వాసీల అభివృద్ధికి కూడా ఉద్యమం చేశారు. 1942లో కాంగ్రెస్ పిలుపు మేరకు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని తెలంగాణలో ఊరూరా ప్రచారం చేసే బాధ్యత వహించారు. 1946లో మెదక్ జిల్లా కందిలో కేశవరావు అధ్యక్షతన జరిగిన 13వ ఆంధ్ర మహాసభ సందర్భంగా నిర్వహించిన బ్రహ్మాండమైన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. 1947 ఆగస్టు 7న మధిరలో స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన సత్యాగ్రహం మరువలేనిది. దానికి బాధ్యుడైన కేశవరావుకు ప్రభుత్వం రెండు సంవత్సరాలు కారాగార శిక్ష విధించింది. యావత్ భారత దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చు కోవడానికి ఉవ్విళ్లూరుతున్న సందర్భంలో కేశవరావు వంటి నాయకులు నిర్భంధానికి గురికావడం ఒక విషాదం. నిజాం సంస్థానం భారత దేశములో విలీనమైన తరువాత, 1952లో కేశవరావు రాజ్యసభకు ఎన్నికయ్యారు.

హైదరాబాద్‌పై పోలీసు చర్య అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలను తీవ్రంగా నిరసించిన మొట్టమొదటి కాంగ్రెస్ వ్యక్తి కేశవరావు. అప్పటి మిలిటరీ అధికారి నంజప్పను నిలదీసిన నిజమైన ప్రజానాయకుడు సర్దార్. కాంగ్రెస్ పార్టీలో ఉండి జాగీర్దార్లను, జమిందార్లను విమర్శించమంటే ఆనాడు నిజంగా ఒక సాహసమే. నంజప్ప నేతృత్వంలో మిలిటరీ వారు కమ్యూనిస్టుల ఏరివేత పేరిట జరిగిన హింసా కాండను, ముస్లిముల ఊచకోతను కేశవరావు ఖండించారు. ప్రజల పక్షాన నిలిచారు. "మనం ఏ ప్రభుత్వాన్ని అయినా సరే అది రాష్ట్ర, జాతీయ ప్రభుత్వం, కాంగ్రెసు ప్రభుత్వం అయినా, కాంగ్రెసు కాని ప్రభుత్వం అయినా అమాయక ప్రజలపై అత్యాచారాలు జరపడాన్ని సహించబోము. నంజప్ప మన ప్రభుత్వంలో ఒక అధికారి మాత్రమే. యింకా స్పష్టంగా చెప్పాలంటే ఆయన మన ప్రజలకు సేవకుడు. ఆయన యధేచ్ఛగా ప్రవర్తించడానికి, మేము అనుమతించడానికి సిద్ధముగా లేము. ఆయన చేస్తున్న అకృత్యాలు నిజాం తొత్తులైన జాగీర్దార్లను, నాజీ హిట్లరును తలదన్నిన నిజాంను మరిపిస్తున్నది. నంజప్ప తెలంగాణ రక్షకుడిగా కాక, భక్షకుడిగా వచ్చినట్లు అనిపిస్తున్నది." అని డోర్నకల్లులో జరిగిన సభలో కేశవరావు ఎలుగెత్తి చాటారు.

సర్దార్ కేశవరావు భాషారాష్ట్ర సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకి. తెలంగాణ అస్తిత్వాన్ని స్థిరీకరించాలని కోరుకున్నారు. కన్నడ, మరాఠీ భాషా ప్రాంతాలతో కలిసి పోయిన హైదరాబాద్ రాష్ట్రం అలాగే ఉండాలని వాంఛించారు. అలాగే జమీం దారి, జాగిర్దారీ వ్యవస్థలతో అతలాకుతలమైన తెలంగాణను విశాలాంధ్రలో కలిపినట్లయితే ఏమాత్రం మేలు జరగదని నొక్కి చెప్పారు. విద్యాపరంగా, సామాజిక, ఆర్థిక రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయకుండా విశాలాంధ్ర ఏర్పాటు వల్ల స్థానికులపై స్థానికేతరుల అజమాయిషీ ఆరంభ మవుతుందని ముందుగానే ఊహించిన అనుభవశాలి ఆయన.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ సభలు, సమావేశాలు జరిగినపుడు ఒక సామాన్య కార్యకర్త మాదిరిగా పందిళ్ళు వేయడానికి, కర్రలు కూడా నాటి నిరాడంబరతకు, పార్టీ పట్ల అంకితభావంకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి, అంతలా పార్టీకి సేవ చేసిన ఆయనకు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల మూలంగా రావాల్సినంత పేరు, దొరకాల్సిన గౌరవం రాలేదు. చేపట్టిన ప్రతి ఉద్యమం లోనూ విజయాల్ని సాధించిన ఆయన స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనకు ద్రోహం చేశారు. ఆయన ఎదుగుదలను అడ్డుకున్నారు. ఎన్నికల్లో ఓటమి చెందేలా పరిస్థితులు కల్పించారు.

జైలు జీవితం, ఉద్యమ సమయంలో భోజనం లేకపోవడం, పార్టీలోని నాయకులు చేసిన మోసం, కలగలిసి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అయిన కేశవరావు 1953, మార్చి 29న తన 46వ ఏట మరణించారు.

సెప్టెంబర్ 3...తెలంగాణ సర్దార్ జయంతి

**–రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494





ఆగష్టు 29న తాడేపల్లి లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా 'తెలుగు మరియు సంస్కృత అకాడమీ' వారి 'గిడుగు' పురస్కారంను చలపాక ప్రకాష్ కు ప్రదానం చేస్తున్న తెలుగు మరియు సంస్కృత అకాడమీ అధ్యక్షులు ఆర్డీ విల్సన్, సంచాలకులు పి. రంజిత్ భాష ఐఏఎస్, అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల త్రివిక్రమ్, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ, 60 సూత్రల అమలు కమిటీ అధ్యక్షులు లంకా దినకర్, పొట్లూరి హరికృష్ణ తదితరులు ఉన్నారు.

# హిమాలయాల జలప్రళయం!



కళ్లముందే ప్రాకృతిక సౌందర్యాలు
కరిగిపోయి వికృతమై పోతున్నాయి,
మూడో ధ్రువంగా పిలుచుకొనే
ఆసేతు హిమాచల పర్యంతం అన్న
నానుడి కనుమరుగై పోనుందా?
హిమాలయాల విపత్తులు, ఉత్పాతాలు
పరిమితికి మించి పెరిగిపోతున్నాయి,
గ్లోబల్ వార్మింగ్ కుంపట్లో
హిమాలయాలు లయమై పోతున్నాయి,
నేపాల్ ఖట్మండ్ పశుపతినాథ్,
కాశ్మీర్ అమర్నాథ్,
నేపాల్ ముక్తిధాం యాత్రలు,
మానస సరోవరాలు,
పవిత్రకైలాస శిఖరాలు,
చార్ ధాం యాత్రలు జల ఖడ్గ
ప్రళయాలతో
వినాశనమై పోతున్నాయి!
అఖండ హిమ పర్యాటకం
పతనావస్థ అంచుకు దిగాజారింది!
నేపాల్ నాలుగు జిల్లాలు
జలప్రళయంలో చిన్నాభిన్నమై పోయాయి!.
ఎవరెస్ట్ కాంచనగంగ ట్రెక్కింగ్ లు
అపర్యావరణం తోడై
అష్ట కష్టాలు పెడుతున్నాయి,
మారుతున్న వాతావరణం
ఘోరకలిలో యాత్రలు
తరుచూ విధ్వంసమై
మానవుల ఉనికినే ప్రశ్నిస్తున్నాయి!.
బుద్ధుడు పుట్టిన శాంతి భూమిలో
భీభత్సాల చెలరేగుతున్నాయి,
పవిత్రమైన మంచు గుట్టలు భస్మీ
పటలమైనట్లుగా ప్రేలిపోతున్నాయి,
ఊహించని వరదలు,
భూకంపాలతో దైవ నేలలు
బురదల మయమై
శవ తాండవమాడుతున్నాయి!.
దేవభూమి మరుభూమిగా
మారిపోతున్నది,
మోక్షమార్గం.. కొడిగట్టిన దీపమై
ప్రమాద హేతువై పోతున్నది,
మంచు పర్వతాలు ఉబికి పోయి
శకలాలై కూలుతూ
పెను విపత్తులకు కారణమవుతున్నాయి,
పెరిగిన భూతాపాలు,
సూపర్ ఎల్ నినో ల ప్రభావాలు
తమ ప్రతాపాన్ని తీవ్రంగా చూపిస్తున్నాయి!
పశుపతినాథుని త్రినేత్రం తెరుచుకొన్నది,
పవిత్రమైన మానస సరోవర సాహస యాత్ర
వందలాది యాత్రీకులకు మృత్యులోయై
పోయింది,
పదహారు విద్యుతుత్పాకత డ్యాములన్నీ
భ్ఫళ్ళుమని నిండు కుండలై పగిలిపోయాయి!
సునామీ, ఉప్పెనలను మించిన
ఆవేశంతో జల విధ్వంసం
ప్రపంచ దేశాల్నే వణికిస్తున్నది!.
కరిగిన మంచు కొండలు,
పగిలిపోయిన సరస్సులు,
పత్తాలేకుండా పోయిన నాలుగు జిల్లాలు,
33 దేశాలకు చెందిన పర్యాటక, జనాలు,
సొరంగాల్లో పనిచేస్తున్న
భారతీయ కార్మికులు
అందరూ వేయి మందియై
మృత్యుఒడిలోకి జారిపోయారు!.
కోయంబత్తూర్ ఈషా పౌండేషన్
భకల గల్లంతు
ప్రమాదకర సంకేతాలై పోయాయి!
2013 నాటి
కేదార విలయం మరువక ముందే
మళ్ళీ తెరపై నేఫాల్ విపత్తు
దావానలమై ఉరిమింది, ,
పెనుముప్పుకు గురిచేసింది..
పర్యావరణ పరిరక్షణే
మనకు శ్రీరామరక్షలు,
విలయాల విపత్తులు ఆగాలంటే
పర్యావరణాన్ని కాపాడు
కోవాలని చెప్పడమే!
(నేపాల్ విపత్తు చూశాక)



**– సంకేపల్లి నాగేంద్రశర్మ**
8074826371

# విద్యార్థి దశలోనే సామాజిక, భావోద్వేగ శిక్షణ తప్పనిసరి చేయాలి


## లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు



హైదరాబాద్, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి ): విద్యార్థులు పరిపూర్ణ ఆకర్షణీయమైన వ్యక్తులుగా ఎదగడానికి పాఠ్యాంశాల్లో భాగంగా సామాజిక మానసిక భావోద్వేగ సమతుల్యతను సాధించడానికి తగిన శిక్షణ అంశాలు బోధించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు కొత్తపల్లి సెయింట్ జార్జి ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన లయన్స్ క్వెస్ట్ కౌమార దశ నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా సామాజిక భావోద్వేగ నియంత్రణకు సంబంధించిన పుస్తకాలను 6, 7, 8వ తరగతి విద్యార్థినీవిద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో కేవలం రెండు పాఠశాలల్లోనే ఈ ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థి దశలోనే కోపం, ఒత్తిడి, భయం, ఆందోళన, ఆనందం, విచారం లాంటి అంశాల్లో నియంత్రణ సాధించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. వ్యక్తిత్వ వికాసం, మంచి అలవాట్లను చేసుకోవడం, చెడు అలవాట్లను వదిలించుకోవడం వంటివి చిన్నతనం నుంచే నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పి ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్వెస్ట్ కౌమార దశ యువత శిక్షణ తరగతులకు తమ పాఠశాలను ఎంపిక చేసి తగిన ఏర్పాట్లు చేసిన శాతవాహన లయన్స్ క్లబ్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిక్షణ పూర్తి చేసిన యువత ప్రవర్తనలో సానుకూల మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో 6, 7, 8వ తరగతి యువతకు సోషల్ ఎమోషనల్ లెర్నింగ్‌కు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేసారు.

# స్వర్గీయ డా వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి వర్ధంతికి నివాళులు అర్పించిన రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి సీతక్క

ములుగు, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా స్వర్గీయ డా వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి వర్ధంతికి నివాళులు అర్పించిన రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి సీతక్క గారు బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి స్వర్గీయ డా వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క గారు.



ఈ సందర్భంగా మంత్రి సీతక్క గారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా, వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి పాలన తెలుగు రాష్ట్రాల చరిత్రలో 'సంక్షేమ స్వర్ణయుగంగా నిలిచిపోయిందని 2004 నుండి 2009 వరకు వారు సాగించిన సంక్షేమ పాలన,పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలు కోట్ల మంది జీవితాలను మార్చేశాయని వారి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, రైతుల కోసం ఉచిత విద్యుత్,రుణమాఫీ,ఫీజు రీయింబర్స్ మెంట్,108,104 వంటి అత్యవసర సేవలు,ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు పావలా వడ్డీ రుణాలు,2 రూపాయలకే బియ్యం, వృద్యాప్త పింఛన్లు, వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి చిరస్థాయిలో నిలిచారని×

వారు భౌతికంగా దూరమైన వారు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్,ఉచిత విద్యుత్ వంటి పథకాలు నేటికి తెలుగు ప్రజల గుండెల్లో ఉన్నారని మంత్రి సీతక్క గారు వారి సేవలను తలుచుకుంటూ నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు,జిల్లా సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ నాయకులు,మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# వంశీ-జమునా రమణారావు మహానంది పురస్కారాలు



పురస్కారం అందజేస్తున్న సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, వంశీ రామరాజు, జమున కూతురు స్రవంతి, సుధామయి, గీతాంజలి తదితరులు.

హైదరాబాద్, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రముఖ సినీ నటి జమునా రమణారావు జయంతి సభ జరిగింది. కార్యక్రమంలో సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు పాల్గొని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు వంశీ-జమునా రమణారావు మహా నంది అవార్డులు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జమున కూతురు స్రవంతి, వంశీ రామరాజు, జాషా, జానకి, రమాచౌదరి, వెంకట్, సంతోష్‌కుమార్, కృష్ణకుమారి, సుధామయి, గీతాంజలి పాల్గొన్నారు.

# ఆదిభట్ల నారాయణదాసు సంస్మరణ సభ



ఆదిభట్ల నారాయణ దాసు సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ.వేదికపై కళా జనార్ధనమూర్తి, జయరాములు, రామభట్టర్, కాకర్ల హనుమంతరావు, గుండవరపు గీతాదేవి.

హైదరాబాద్, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతులలో భాగంగా సోమవారం నాటక రచయిత, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ఆదిభట్ల నారాయణ దాసు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సాహిత్యం, నృత్యాల మేళవింపుతో హరికథ ప్రక్రియను సృజించి హరికథా పితామహ బిరుదు సాధించిన ఆదిభట్ల నారాయణ దాసు బహుభాషా కోవిదునిగా ప్రజల మన్ననలు పొందారన్నారు. వివిధ రాష్ట్రాలలో ప్రదర్శనిచ్చిన ఆదిభట్ల గొప్ప కళాకారుడని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యశ్రీతన జరిగిన ఈ కార్యక్రమంలో జయరాములు, రామభట్టర్, కాకర్ల హనుమంతరావు, గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

# వేల్పూర్ మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నిజామాబాద్, సెప్టెంబర్ 2:వేల్పూర్ మండలం పచ్చలనడుకుడ గ్రామంలో బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ సహకారంతో గ్రామంలోని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఆరె పూజ, నోముల సురేఖ, బండారి రాజు, అంకన్నగారి గంగు, ఈదుల వంశీ, జండాకాడి సాయిలు, గడ్డం చిన్న గంగారం, పూప్పల పవన్‌లకు కలిపి రూ. 3,32,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సహకరించిన అన్వేష్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్‌తో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ టక్కరి గంగాధర్, ఫుట్ అవతల నర్సారెడ్డి, హలీముద్దీన్, కృపానందం, నాచ్చన్నగారి గంగారెడ్డి, గట్టాతల చిన్న రాజన్న, రతీష్, శ్రీను, గంగ సాయిలు, రిజ్వాన్, నాని, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.